V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

బుధవారం
18-09-2024

సంపుటి : 01 । సంచిక : 136 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్








# వినాయకా.. వెళ్లిరా ఇక!

## హైదరాబాద్‌లో ఘనంగా గణేశ్ నిమజ్జనం

- భక్తులతో కోలాహలంగా మారిన రహదారులు
- ఎల్లెడలా పండుగ వాతావరణం
- నిమజ్జనాన్ని పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి
- గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ బడాగణేశ్

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:**

తొమ్మిదిరోజుల పాటు భక్తుల పూజలు అందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరారు. మంగళవారం హైదరాబాద్‌లో నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా, కన్నుల పండువగా సాగింది. భక్తుల నృత్యాలు, కేరింతలు, నినాదాలు, డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్రలు సందడిగా సాగాయి. ప్రధాన రహదారులన్నీ కాషాయ జెండాలతో కళకళలాడాయి. గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కూడళ్లలో వేదికలు ఏర్పాటు చేసి స్వాగతించారు. ఈ వేదికలనుంచి మిగతా2లో...

### ఫాంహౌస్ సీఎంను కాను..

# పనిచేసే ముఖ్యమంత్రిని

## గత పదేళ్లలో తెలంగాణ నియంత పాలనలో మగ్గిపోయింది

- నాలుగు కోట్ల ప్రజల సంక్షేమమే గీటురాయిగా మా పాలన
- అందుకే 'ప్రజా పాలన దినోత్సవం' గా సెప్టెంబరు 17
- లోతైన ఆలోచనతోనే ఈ పేరు పెట్టాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** గడిచిన పదేళ్ల నియంత పాలనలో తెలంగాణ మగ్గిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ అస్థిత్వం అంటే.. కుటుంబ పాలనకాదని, పాలన బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. కాలు కదపకుండా ఇంట్లో సేదదీరడానికి తాను ఫాంహౌస్ సీఎంను కాదని, పనిచేసే ముఖ్యమంత్రినని ఆయన స్పష్టం చేశారు. ఐక్యత, సమైక్యతను దెబ్బతీసేందుకు కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. తెలంగాణ ప్రస్థానంలో సెప్టెంబర్ 17 అత్యంత కీలకమైన రోజు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లోతైన ఆలోచన చేసి ఈ శుభ దినానికి ప్రజా కోణాన్ని జోడిస్తూ ''ప్రజా పాలన దినోత్సవం'' గా జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో రాజకీయం లేదని, ఇందులో రాజకీయ ప్రయోజన కోణంలో మిగతా2లో...

# హైడ్రాకు ప్రజలు సహకరించాలి

- హైదరాబాద్ భవిష్యత్తుకు ఇది గ్యారంటీ
- ఇందులో రాజకీయ కోణం లేదు
- సీఎం రేవంత్‌రెడ్డి


2


2

## లడ్డూ వేలంలో రికార్డులు బద్దలు

బాలాపూర్‌ను మించిన బండ్లగూడ

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

# ఢిల్లీ సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా

## నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న ఆతిశీ

### దేశ రాజధానికి మూడో మహిళా సీఎం





**ఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఆప్ శాసనసభా పక్ష నేతగా మంత్రి అతిశీని ఎన్నుకున్నట్లు ఎల్జీకి కేజ్రీ తెలిపారు.మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ అరెస్టైన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో శుక్రవారం ఆయన తీహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత ఆదివారం ఆప్ నేతలు, మిగతా2లో...



### ఉద్దేశపూర్వకంగా తెలంగాణ చరిత్రను

# తొక్కి పెట్టారు


- రజాకార్ల ఆగడాలతో ప్రజలు నరకం అనుభవించారు
- నిజాం లొంగుబాటులో పటేల్ పాత్ర కీలకం
- ఆగస్టు 15 లాగే సెప్టెంబరు 17కు ప్రాధాన్యం
- విమోచన దినోత్సవంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** పనిముట్లనే ఆయుధాలుగా చేసుకొని ప్రజలు నిజాంపై పోరాటం చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రజాకార్ల ఆగడలతో ఇక్కడి ప్రజలు ప్రత్యక్ష నరకం అనుభవించారని చెప్పారు. నిజాం హయాంలో బలవంతపు మత మార్పిడిలు జరిగాయని, హిందూ మహిళలను బలవంతంగా ఎత్తుకెళ్లి మిగతా3లో...

## 100 రోజుల్లో విప్లవాత్మక మార్పులు

- 9 నెలల మీ పాలనలో కాంగ్రెస్ చేసిందేమిటి?
- జవాబివ్వకుంటే ప్రజలు కాంగ్రెస్ ను క్షమించబోరు
- రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడమే మా లక్ష్యం
- మహిళల కోసం రూ.3 లక్షల కోట్లు కేటాయింపు
- కనీస మద్దతు ధర కోసం రూ.2 లక్షలు కోట్లు కేటాయించాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్


3



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 100 | రిటైల్ ₹ 122 |
| స్కిన్ ₹ 177 | స్కిన్ లెస్ ₹ 201 |

# రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రాణి కుముదిని నియామకం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ( ఎస్ ఈ సి ) రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాణి కుముదిని నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆ పదవిలో సీనియర్ అధికారి పార్థసారధి కొనసాగారు. మిగతా2లో...



# అక్టోబర్ 1 వరకు బుల్డోజర్ చర్యలు వద్దు

- నైట్ షిఫ్ట్‌కు మహిళలను వద్దనలేం
- కోల్‌కతా డాక్టర్ కేసు విచారణ కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని ఆపేది లేదు
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

10



# బుల్డోజర్ చర్యలపై సుప్రీం ఆదేశాలు 'హైడ్రా'కు వర్తించవు

- నేరస్థుల ఆస్థులకే అవి పరిమితం
- ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలనే మేం కూలుస్తున్నాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

2



# లడ్డూ వేలంలో రికార్డులు బద్దలు

## బాలాపూర్‌ను మించిన బండ్లగూడ



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** వినాయక ఉత్సవాల్లో ముఖ్య ఘట్టం లడ్డూల వేలం. నిమజ్జనం చేసే రోజు ఉదయం లడ్డూలను వేలంవేసే సంస్కృతి కొనసాగుతోంది . లడ్డూ దక్కించుకుంటే మంచి జరుగుతుందని చాలా మంది విశ్వసిస్తారు. అందుకోసం ఎంతైనా వేలం వేసేందుకు వెనకాడారు. గణేశ్ లడ్డూ వేలం పాట అంటే ముందుగా గుర్తొచ్చేది బాలాపూర్ లడ్డూ. ఈసారి బాలాపూర్ లడ్డూ కన్నా ఇతర చోట్ల లడ్డూలు మంచి ధర పలికాయి.

**బండ్లగూడలో రూ.కోటి దాటిన లడ్డూ**

బండ్లగూడలో ఓ లడ్డూ రూ.కోటి పైగా పలికింది. బండ్లగూడ జాగీర్‌లో కీర్తి రిచ్ మండ్ విల్లాస్‌లో వేలం జరిగింది. విల్లాలో ఉన్న కమ్యూనిటీ లడ్డూను దక్కించుకుంది. అందరూ కలిసి రూ.1.87 కోట్లకు వేలం వేశారు. గతంలో రూ.1.26 కోట్లకు లడ్డూను సొంతం చేసుకున్నారు. వచ్చిన డబ్బులను పేదల కోసం ఉపయోగిస్తామని ప్రకటించారు.

**బాలాపూర్‌లో రూ.30 లక్షలు**

బాలాపూర్ లడ్డూ రూ.30 లక్షల వెయ్యి రూపాయలు పలకింది. కొలను కుటుంబం లడ్డూను దక్కించుకుంది. కొలను శంకర్ రెడ్డి వేలం వేసి, ఆ వెంటనే కమిటీకి నగదును అందజేశారు. గత ఏడాది లడ్డూను రూ.27 లక్షలకు దాసరి దయానంద్ రెడ్డి దక్కించుకున్నారు. బాలాపూర్ లడ్డూ వేలం 1994లో రూ. 450తో ప్రారంభమై.. ఇప్పుడు రూ.30 లక్షలకు చేరుకుంది.

- మాదాపూర్‌లో మై హోమ్ భుజాలో గణేశ్ లడ్డూ రికార్డు ధర పలికింది. ఖమ్మం జిల్లా కొండపల్లికి చెందిన గణేశ్ రూ.29 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. గత ఏడాది ఇక్కడ లడ్డూ రూ.25.50 లక్షలు పలికింది.
- విజయవాడ రూరల్ నున్న పంచాయతీ పరిధిలో లడ్డూ భారీ వేలం పలికింది. శ్రీసాయి బాలాజీ ఎన్ క్లేవ్ అపార్ట్ మెంట్‌లో లడ్డూ రూ.26 లక్షలు పలికింది. ప్రైవేట్ కంపెనీ మేనెజింగ్ డైరెక్టర్లు సింగంరెడ్డి ప్రదీప్ రెడ్డి, నక్కా రామ్ లడ్డూను రూ.26 లక్షలకు సొంతం చేసుకున్నారు.
- ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరులో లడ్డూ భారీ ధర పలికింది. దివ్య గణేష్ ఉత్సవ కమిటీ లడ్డు వేలం పాట వేసింది. దెందుకూరుకు చెందిన టీ ఉపేంద్ర రూ.2.90 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.

# బుల్డోజర్ న్యాయంపై సుప్రీం ఆదేశాలు 'హైడ్రా'కు వర్తించవు



**విశ్వంభర, హైదరాబాద్:** బుల్డోజర్ న్యాయాన్ని ఆపాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవని తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నేరస్థులు, నిందితుల ఆస్తుల కూల్చివేతలకు మాత్రమే సుప్రీం ఆదేశాలు వర్తిస్తాయన్నారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి నిర్మించిన వాటిని మాత్రమే హైడ్రా కూల్చివేస్తుందని స్పష్టం చేశారు.నేరస్థులు, నిందితులకు సంబంధించిన ఎలాంటి ఆస్తుల జోలికి హైడ్రా వెళ్లడం లేదని రంగనాథ్ పేర్కొన్నారు. బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపులో తమ ఆదేశాలు వర్తించవన్న సుప్రీంకోర్టు ఆదేశాలను రంగనాథ్ గుర్తుచేశారు. హైడ్రా కూల్చివేతలపై ఇటీవల పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. హైడ్రా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా కూల్చివేతలు చేస్తుందని, న్యాయం చేయాలంటూ కోర్టును ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలు రావడంతో రంగనాథ్ స్పందించారు. ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవని స్పష్టం చేశారు.

# పట్టపగలే దంపతులను నమ్మించి బంగారు గొలుసు చోరీ చేసిన దుండగులు

**విశ్వంభర, నిజాంపేట:** నగలు జాగ్రత్తగా పెట్టుకోవాలంటూ..నమ్మించి దంపతుల నుంచి పట్టపగలే 3 తులాల బంగారు గొలుసును దుండగులు చోరీ చేసిన సంఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని నందిగామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నందిగామ గ్రామానికి చెందిన దంపతులు బలిజ లక్ష్మి, మల్లేశం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు వైద్యం కోసం వెళ్తున్నారు. ఈ క్రమంలో నందిగామ గ్రామ శివారు రాయిలాపూర్ గేట్ వద్దకు రాగానే గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అడ్డం వచ్చి అమ్మా..దొంగలు ఉంటారు జాగ్రత్త.బంగారు నగలు మెడలో ఉంటే ఎత్తుకెళ్తారని లక్ష్మిని నమ్మించి, 3 తులాల బంగారు గొలుసును తెల్లటి కాగితంలో చుట్టి ఇస్తానంటూ మాయమాటలు చెప్పారు. ఇదే అదనుగా భావించిన దుండగులు తెల్లటి కాగితంలో బంగారు గొలుసుకు బదులు సమాన బరువు గల రాళ్లను పెట్టి లక్ష్మికి ఇచ్చారు. గమనించని బాధితురాలు రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు వెళ్లి తెల్లటి కాగితంలో రాళ్లను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత దంపతులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్ తెలిపారు.







# వినాయకా.. వెళ్లిరా ఇక!

(మొదటి పేజీ తరువాయి)

పలువురు వక్తలు ప్రసంగించారు. కళాకారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. సేవా సంస్థల వారు మంచినీరు, ఆహార ఏర్పాట్లను చేశారు. పోలీసులు అడుగడుగునా నిఘాపెట్టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూశారు ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం మంగళవారం ఒంటిగంటన్నరకు పూర్తయ్యింది. ట్యాంకుబండ్‌పై నాలుగో నంబరు క్రేన్ ద్వారా బడా గణపతిని హుస్సేన్ సాగర్ లో నిమజ్జనం చేశారు. ఇక్కడికి భక్తులు భారీగా తరలివచ్చారు. హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలు గణపతి బప్పా మోరియా నినాదాలతో హోరెత్తాయి. మహా గణపతి నిమజ్జనాన్ని చూసి భక్తులు పులకించిపోయారు. మంగళవారం ఉదయం నుంచి ఖైరతాబాద్ గణేషుడి శోభాయాత్ర అట్టహాసంగా, కన్నుల పండుగలా జరిగింది. గణపతి నిమజ్జన వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, జీహెచ్ఎంసీ మేయర్ జి. విజయలక్ష్మీ పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులు వారి వెంట ఉన్నారు.

**కిక్కిరిసిన ట్యాంక్‌బండ్ పరిసరాలు**

'జై గణేశ్ మహారాజ్ కీ జై' అంటూ భాగ్యనగరం మొత్తం నామస్మర ణ మార్మోగిపోయింది. ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు గణేశుడి నిమజ్జనానికి విచ్చేసిన భక్తులతో కిక్కిరిసిపోయి సందడిగా మారాయి. ఇసుకేస్తే రాలనంతగా భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతం కోలాహలంతో సందడి నెలకొంది. అలాగే ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనాన్ని హుస్సేన్‌సాగర్‌లో కనులారా వీక్షించేందుకు భారీగా తరలివచ్చారు. దీంతో హుస్సేన్ సాగర్ ప్రాంతాలైన ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్, తెలుగు తల్లి ఫ్లైఓవర్, సచివాలయం ఐ మ్యాక్స్ మార్గాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేలాది గణపతులను హుస్సేన్‌సాగర్ లోకి ని మజ్జనం చేస్తూ వెళ్లిరావయ్యా గణపయ్య మళ్లీ అంటూ జనాలు నీరాజనం పట్టారు. గణేశుడు గంగమ్మ చెంతకు వెళ్లినప్పుడు భక్తులు తమ సెల్‌ఫోన్లలో ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జన దృశ్యాలను వీడియో, సెల్ఫీల రూపంలో భద్రపరచుకున్నారు.

**ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ గేట్లు మూసివేత**

గణపతి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులతో ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌కు భారీగా ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో మెట్రో సిబ్బంది మెట్రో స్టేషన్ గేట్లను మూసివేశారు. పది నిమిషాలకు ఒకసారి ప్రయాణికులకు సిబ్బంది లోపలికి పంపిస్తు న్నారు. మెట్ల వద్ద గేట్లు మూసివేయడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర ఘనంగా సాగింది. ఈ శోభా యాత్రలో భక్తులు నృత్యాలు చేశారు. బాలాపూర్ గణేశ్ శోభాయాత్రను డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు న్నట్లు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సీసీ కె మెరాల ద్వారా పరిస్థి తిని పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జనాలు జరుగుతున్నాయని, దాదాపు లక్ష విగ్రహాలు నిమజ్జనాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.





# ఫాంహౌస్ సీఎంను కాను.. పనిచేసే ముఖ్యమంత్రిని



(మొదటి పేజీ తరువాయి)

సెప్టెంబర్ 17ను చూడటం అవివేకమవుతుందని తెలిపారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పబ్లిక్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలందరికీ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.అంతకు ముందు అమర వీరులను స్మరిస్తూ గన్‌పార్క్ అమర వీరుల స్థూపం వద్ద సీఎం నివాళులర్పించారు. "ప్రజా పాలన దినోత్సవం అనే ఈ నిర్ణయం నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష. నాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి ఈ నిర్ణయాన్ని ఎవరైనా తప్పుపడితే వారిది స్వార్థ ప్రయోజనమే అవుతుంది తప్ప ప్రజాహితం కాబోదు. తెలంగాణ భౌగోళిక స్వరూపం బిగించిన పిడికిలి మాదిరిగా ఉంటుంది. ఆ పిడికిలి పోరాటానికి సంకేతం . తెలంగాణలో అన్ని జాతులు, కులాలు, మతాలు కలిసికట్టుగా ఉంటాయన్న సందేశం అందులో ఇమిడి ఉంది. ఈ ఐక్యతను, ఈ సమైక్యతను దెబ్బతీసే విధంగా సెప్టెంబర్ 17 ను వివాదాస్పదం చేయడం మంచిది కాదు"అని రేవంత్ రెడ్డి అన్నారు.

**అమరులకు నివాళి అర్పిస్తున్నా..**

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలంగాణ బానిస సంకెళ్లు తెంచిన చారిత్రాత్మక ఘట్టం 1948 సెప్టెంబర్ 17న ఇదే హైదరాబాద్ గడ్డపై ఆవిష్కృతమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనాన్‌రు. తెలంగాణ అంటే త్యాగం, ఆ త్యాగాలకు ఆద్యుడు దొడ్డి కొమురయ్య అని చెప్పారు. నాటి సాయుధ పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారని, ఆ నాటి సాయుధ పోరాటంలో అమరులైన వీరులకు ఈ సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నానని సీఎం తెలిపారు. అలాగే తెలంగాణ ప్రజలకు ‘‘ప్రజా పాలన దినోత్సవ’’ శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు .సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రస్థానంలో అత్యంత కీలకమైన రోజు, ఈ శుభదినాన్ని ఎలా నిర్వచించుకోవాలన్న విషయంలో ఇప్పటి వరకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నారు.కొందరు విలీన దినోత్సవమని, కొందరు విమోచన దినోత్సవమని సంబోధిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించాం. స్వప్రయోజనాల కోసం నాటి అమరుల త్యాగాలను పలుచన చేసేలా ప్రవర్తించడం సరికాదని ప్రజా ప్రభుత్వం భావించింది. అందుకే ఈ శుభదినానికి ప్రజా కోణాన్ని జోడిస్తూ... ప్రజా పాలన దినోత్సవంగా నామకరణం చేశామని సీఎం చెప్పారు.

**తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి కృషి**

జయ జయహే తెలంగాణ... గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా, సంక్షిప్త నామాన్ని టీజీగా మార్చడం, సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ, గద్దర్ పేరిట అవార్డులు, మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును ఖరారు చేయడం వంటి చర్యలతో తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి కృషి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.ఎందరో మహనీయుల త్యాగఫలం మన తెలంగాణ. పరిపాలనలో, ప్రతి నిర్ణయం సందర్భంలో వారి త్యాగాలు మాకు గుర్తుంటాయన్నారు . నాలుగు కోట్ల ప్రజల సంక్షేమమే గీటురాయిగా పాలన ఉంటుందని పేర్కొన్నారు . తెలంగాణ ప్రజలే ఈ రాష్ట్ర ప్రస్థానానికి నావికులు, వారి ఆలోచనలే మా ఆచరణ, వారి ఆకాంక్షలేమా కార్యాచరణ అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**తెలంగాణ హక్కుల కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీకి వెళ్తా..**

ఇక తన ఢిల్లీ పర్యటనపై విమర్శలు చేయడాన్ని రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. తన స్వార్థం కోసమో, వ్యక్తిగత పనుల కోసమో తాను ఢిల్లీ వెళ్లడం లేదని తెలిపారు. తెలంగాణ హక్కుల సాధన కోసం ఎన్నిసార్లైనా ఢిల్లీ వెళ్తానని రేవంత్ ప్రకటించారు. ఢిల్లీ భారతదేశంలోనే ఉందని, మరో దేశంలో లేదన్నారు. కేంద్రం నుంచి రావలసిన ప్రతి పైసా తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# హైడ్రాకు ప్రజలు సహకరించాలి

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** హైడ్రా వేనుక రాజకీయ కోణం లేదని, స్వార్థం లేదని, అదొక పవిత్ర కార్యమని, ప్రకృతిని కాపాడుకునే యజ్ఞమని దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు హైడ్రా పని తీరుపై వస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒకప్పుడు లేట్ సిటీగా పేరుపొందిన హైదరాబాద్.. ఈరోజు ఫ్లడ్ సిటీగా దిగజారిపోవడానికి గత పదేళ్ల పాలకుల పాపమే కారణమని అన్నారు. వాటి ప్రక్షాళన కోసమే హైడ్రాను ఏర్పాటు చేశామని సీఎం స్పష్టం చేశారు. చెరువులు, నాలాలను కాపాడుకోలేకపోతే భవిష్యత్ తరాలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఇటీవల కేరళలో ప్రకృతి విలయతాండం చూశామని.. వేలాది ప్రాణాలు ప్రకృతి ప్రకోపానికి బలైపోయాయన్నారు. ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కొందరు భూ మాఫియా వాళ్లు.. పేదలను ముందు పెట్టి హైడ్రా లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా హైడ్రా ఆగదని, హైదరాబాద్ భవిష్యత్తుకు హైడ్రా గ్యారంటీ ఇస్తుందని.. ఇది తన భరోసా అని సీఎం అన్నారు. దీనికి ప్రజలు సహకరించాల్సిందిగా మరొక్కసారి కోరుతున్నారని అన్నారు.

# రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ రాణి కుముదిని

(మొదటి పేజీ తరువాయి)

ఆయన పదవీకాలం ఇటీవల ముగియడంతో రాణి కుముదినిని ప్రభుత్వం నియమించింది. 1988 బ్యాచ్‌కు చెందిన కుముదిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర సర్వీసుల అనంతరం తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు చేపట్టారు. 2023 ఎన్నికలకు ముందు పదవీ విరమణ చేశారు. నాటి కేసీఆర్ ప్రభుత్వం ఆమెను తిరిగి అదే హోదాలో కొనసాగించింది. ఇప్పటి వరకు ఎస్ఈసీగా ఉన్న పార్థసారథి పదవీ కాలం ఈ నెల ఎనిమిదో తేదీతో ముగిసింది. దీంతో ఎస్ఈసీగా రాణి కుమిదినిని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. మూడేండ్ల పాటు ఆమె ఎస్ఈసీగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నూతన ఎస్ఈసీ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

**రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా విశ్రాంత ఐఏఎస్ ఎంజీ గోపాల్**

రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా విశ్రాంత ఐఏఎస్ ఎంజీ గోపాల్‌ను ప్రభుత్వం నియమించింది. 1983 బ్యాచ్‌కు చెందిన గోపాల్ ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ రాష్ట్రంలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆ యనను రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా మూడేండ్ల పాటు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఢిల్లీ సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)



కార్యకర్తలను ఉద్దేశించి తొలిసారి ప్రసంగించారు. ఈ సందర్భంగా తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. మరో రెండు రోజుల్లో శాసనసభా పక్ష సమావేశం నిర్వహించి తన స్థానాన్ని భర్తీ చేసే అంశంపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలోనే మంగళవారం సీఎం కేజ్రీవాల్ నివాసంలో శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఢిల్లీ తదుపరి సీఎంగా ఆతిశీని కేజ్రీ ప్రతిపాదించారు. కేజ్రీ ప్రతిపాదనకు పార్టీ ఎమ్మెల్యేలు ఆమోదం తెలిపారు. దీంతో ఆమె శాసనసభాపక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. వారం రోజుల్లో ఆతిశీ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. అప్పటి వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ కొనసాగనున్నారు.



# హిందువులందరిని ఏకం చేసే పండుగ వినాయక చవితి

## శోభాయాత్రకు బయలుదేరిన గణనాధులు

**విశ్వంభర, వనస్థలిపురం :** గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా ఆటోనగర్ నుండి అబ్దుల్లాపూర్ మెట్టు చెరువులో నిమజ్జనానికి వెళుతున్న గణనాదులకు తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూడిద నందా రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూడిద రామ్ రెడ్డి, ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం తెలియజేయడం కోసం ఆటోనగర్ మెయిన్ రోడ్డు పక్కన వేదికను ఏర్పాటు చేయడం జరిగింది అసోసియేషన్ సభ్యులందరు నిమజ్జనాల కోసం వెళుతున్న గణనాధులపై పూలు వెదచల్లుతూ,హిందూ భక్తులందరికీ ప్రసాదాలు వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్,జిహెచ్ఎంసి బీజేపీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహా రెడ్డిపాల్గొని మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భారతదేశంలో ముంబై , భాగ్యనగరంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని హిందువులంతా ఏకతాటిపైకి వచ్చి ఈ నవరాత్రి ఉత్సవాలను ఎంతో ఉత్సాహంతో జరుపుకుంటారని అన్నారు ఈరోజు వినాయక నిమజ్జనం సందర్భంగా నిమజ్జనానికి వెళుతున్న వినాయకులకు స్వాగతం తెలియజేయడం కోసం ఒక వేదికను ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమని ఈ సంస్కృతి బాలాపూర్ నుండి వయా చార్మినార్ ట్యాంక్బండ్ కు వెళ్తున్న గణనాధులకు హిందూ బంధువులందరూ తమకు తోచిన విధంగా సహాయం చేస్తారని ఆ సంస్కృతి ఇవాళ ఎల్బీనగర్, వనస్థలిపురం దాటి ఆటోనగర్ వరకు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఇంత గొప్ప కార్యక్రమాన్ని ఆటోనగర్లో ప్రారంభించినటువంటి తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూడిద నందా రెడ్డిని, రాష్ట్ర ఉపాధ్యక్షులు బూడిద రాంరెడ్డిని సుర్వి రాజుగౌడ్ని, ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం సభ్యులను వారు అభినందించారు కులాలుగా విడిపోయి ఏరులై పారుతున్న హిందువులందరిని ఏకం చేసే పండుగ వినాయక చవితి అని భవిష్యత్తులో ఎవరు ఏయే రాజకీయ పార్టీలలో ఉన్నా కూడా హిందువులందరూ ఏకతాటి మీదికి రావాల్సిన తరుణం ఆసన్నమైందని హిందువులలో ఐకమత్యం లేకపోవడం వల్లనే ఇవాళ ఎన్నో రాష్ట్రాలలో హిందువులు మైనారిటీలయ్యారని వారికి సందర్భంగా గుర్తు చేసి హిందువులలో ఐకమత్యం పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు చేసిన అసోసియేషన్ నాయకులకు ఆ గణనాధుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఆటోనగర్ ఇసుకల్లర్ల యజమానుల సంఘం అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాల్వ కొండల్ రెడ్డి మెకానిక్ బాబు నాయకులు జంగారెడ్డి సింహాద్రి యాదవ్ లగోని అంజయ్య గౌడ్ ఆకుల శ్రీను బొమ్మిరెడ్డి సత్తిరెడ్డి దేవుని బోయిన మహేష్ యాదవ్ బాత్క శేఖర్ యాదవ్ సుర్వి రవి గౌడ్ గోదుమగడ్డ జంగారెడ్డి రవీందర్ గౌడ్ బచ్చు రాజేందర్ అంతటి నరేష్ గౌడ్ సుర్వి మహేష్ గౌడ్ పందుల నాగేష్ గౌడ్ ముచ్చర్ల లింగస్వామి యాదవ్ ఆవుల లింగస్వామి యాదవ్ సైదులు గౌడ్ కృష్ణ యాదవ్ చందు, ఇసుక లారీల యజమానులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ వాటర్ వీక్ సదస్సుకు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ఢిల్లీ:** ఢిల్లీలో జరుగుతున్న '8వ ఇంటర్నేషనల్ వాటర్ వీక్' సదస్సుకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. మంగళవారం న్యూఢిల్లీలోని భారత మండపంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 8వ ఇంటర్నేషనల్ వాటర్ వీక్ సదస్సు- 2024 లో పాల్గొన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభమైన ఈ సదస్సు నేటి నుంచి నాలుగు రోజుల పాటు కొనసాగనుంది.ఈ సదస్సులో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు పలు దేశాల, పలు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులు, నీటి పారుదల రంగ నిపుణులు పాల్గొన్నారు. సదస్సులో ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రాష్ట్రం జల వనరుల నిర్వహణలో చేస్తున్న కృషిని ప్రధానంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి జల సంబంధిత ఆవిష్కరణలు, ప్రాజెక్టుల ప్రదర్శన కూడా జరిగింది.

# త్యాగాలను స్మరించుకోవాల్సిన తరుణమిది

## హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

**విశ్వంభర, హైదరాబాద్:** విమోచన ఉద్యమంలో ఎదుర్కొన్న బాధాకర పరిస్థితుల గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందని హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆనాటి నాయకులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన సమయమిదన్నారు. విమోచనం కోసం పోరాడిన యోధులను స్మరించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని... ... అసెంబ్లీ ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి ఆయన మంగళవారం పులమాల వేసి నివాళులర్పించారు. 76 ఏళ్ల విమోచన దినోత్సవ వేడుకలు జరుపుకోవటం గర్వకారణమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భారత్‌కు 1947 ఆగస్టు15 నాటికే స్వాతంత్య్రం వచ్చినా.. హైదరాబాద్‌లో భాగంగా ఉన్న తెలంగాణ, మరాఠ్వాడ, కర్ణాటక లోని కొన్ని ప్రాంతాలు మాత్రం 1948 సెప్టెంబర్ 17న స్వేచ్ఛావాయువులు పీల్చాయని పేర్కొన్నారు. హైదరాబాద్ విమోచన ఉద్యమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్న దత్తాత్రేయ.. విమోచనం కోసం ప్రజలు చేసిన ఉద్యమం చరిత్రాత్మకమన్నారు.

# ఉద్దేశపూర్వకంగా తెలంగాణ చరిత్రను తొక్కి పెట్టారు

(మొదటి పేజీ తరువాయి)

అఘాయిత్యాలు చేశారన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని పాకిస్థాన్‌లో కలపాలని నిజాం భావించాడని, చర్చలు కూడా జరిపారని వెల్లడించారు. కేంద్ర పభుత్వ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం జరిగిన హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకల్లో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది హైదరాబాద్ ముక్తి దివస్ నిర్వహిస్తామన్నారు. తెలంగాణ చరిత్రను తొక్కిపెట్టే ప్రయత్నం చేశారని వెల్లడించారు. సంస్కృతి, సంప్రదాయాలను నిజాం చెరిపేసే ప్రయత్నం చేశారని తెలిపారు. స్వాతంత్యం కోసం చేసిన త్యాగాలు, బలిదానాలు దాచడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధాని ఆదేశాలతో 2022 నుంచి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో కూడా ఇదే వేదికగా తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సర్దార్ పటేల్ నిజాంతో ముందుగా శాంతి చర్చలు జరిపారని, తమ సంస్థానం జోలికి వస్తే హైదరాబాద్‌లో ఉన్న కోటిన్నర హిందువులను చంపేస్తామని ఖాసిం రజ్వీ బెదిరించారన్నారు. అందుకే ఆపరేషన్ పోలోతో



హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేశారని తెలిపారు. నిజాం, రజాకార్ల మెడలు వంచడంలో పటేల్ పాత్ర సాహసోపేతమైందన్నారు. ఈ గడ్డకు స్వాతంత్య్రం వచ్చిన రోజును జరపకుండా పాలకులు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. తాము నిర్వహించే ఈ ఉత్సవాలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారన్నారు. మనకు వాస్తవ చరిత్ర తెలియాల్సిన అవసరం ఉందని చెప్పారు. చరిత్ర గాడి తప్పితే భవిష్యత్తు తరాలు ప్రమాదంలో పడతాయన్నారు. పథకం ప్రకారం చరిత్రను పక్కదారి పట్టిస్తున్నారు. ఆగస్ట్ 15 ఎంత ముఖ్యమో.. సెప్టెంబర్ 15 కూడా అంతే ముఖ్యమన్నారు. చరిత్రను పట్టించుకోని పార్టీలను తరిమికొడదామని పిలుపునిచ్చారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించేందుకు సహకరించిన ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

### ఆ రెండు పార్టీలవి దిగజారుడు రాజకీయాలు

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రజాకార్ల వారసత్వమైన మజ్లిస్ పార్టీకి కొమ్ముకాస్తూ తెలంగాణ విమోచన దినోత్సవాలను నిర్వహించకుండా దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు , కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రాంతానికి నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించిన సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఇది నిజాం నుంచి తెలంగాణకు విమోచనం లభించిన రోజని ఆయన అన్నారు. వేలాది మంది తెలంగాణ ప్రజలు వీరోచిత పోరాటం చేశారని, అనేక బలిదానాలు, అనేక త్యాగాల అనంతరం తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందని గుర్తు చేశారు.లిబరేషన్ డే ఉత్సవాలు, విశ్వకర్మ జయంతి ఉత్సవాలు, వినాయక శోభాయాత్ర ఉత్సవాలు, ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు.. ఇలా నాలుగు ప్రధాన ఘట్టాలు ఒకేసారి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురువేసిన కిషన్‌రెడ్డి, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న సీఎం రేవంత్

**విశ్వంభర, మెదక్:** ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను 100 రోజుల్లో రేవంత్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిగా ఎందుకు అమలు చేయలేదని మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు.మంగళవారం మెదక్ లో ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ .. డిసెంబర్ 9న రైతులకు పూర్తిగా రుణమాఫీ చేస్తామని మోసం చేశారని విమర్శించారు . తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు మాని ప్రజలకు మంచిపాలన అందించాలని కోరారు. సీఎం పదవిని అడ్డం పెట్టుకొని రేవంత్‌రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి కూడా రేవంత్‌రెడ్డి లాగా వ్యవహరించలేదని చెప్పారు. డిసెంబర్ 9న రైతులకు పూర్తిగా రుణమాఫీ చేస్తామని మోసం చేశారని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ సీఎం కాగానే మొదటి నెలలోనే రూ.2 వేల పింఛన్ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 4 వేల పెన్షన్ ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. 2024 మార్చి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులను.. బీఆర్ఎస్ ప్రభుత్వం మీద నెట్టేస్తున్నారని హరీశ్‌రావు




విమర్శించారు. బీఆర్ఎస్ సర్కార్ తీసుకున్న అప్పు రూ 4.26 లక్షల కోట్లు అని తానే గతంలో చెప్పానని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడేమో రూ .7 లక్షల అప్పు రాష్ట్రంపై ఉందని చెబుతున్నారని హరీశ్‌రావు అన్నారు. నేడు రాష్ట్రం దివాలా అంటూ తెలంగాణ ప్రతిష్ఠను దిగజార్చుతున్నారని ధ్వజమెత్తారు. 'రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతీస్తే నువ్వు తీసుకున్న గోతిలో నువ్వే పడుతావు' అని హెచ్చరించారు. రాష్ట్ర భవిష్యత్ కంటే నీకు రాజకీయాలే ముఖ్యమయ్యాయా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. కేసీఆర్‌ను తిట్టడమే సీఎం రేవంత్ పరమావధిగా పెట్టుకున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులు సమస్యలతో సతమతం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.జై తెలంగాణ అననోళ్లు.. అమరవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారని.. దీంతో తెలంగాణ అమరుల ఆత్మ ఘోషిస్తోందని అన్నారు.

# 100 రోజుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం




**విశ్వంభర, హైదరాబాద్ :** నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని అమలు చేసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇచ్చిన హామీలతోపాటు ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేదిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ''మహిళల కోసం రూ.3 లక్షల కోట్ల కేటాయించినం. కనీస మద్దతు ధర కోసం రూ.2 లక్షలు కోట్లు కేటాయించినం. ముద్రా రుణపరిమితిని పెంచినం. రూ.5.36 లక్షల కోట్లతో 3 కోట్ల ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకున్నం. 75 వేల మెడికల్ సీట్లను అదనంగా మంజూరు చేసినం. మూలధన వ్యయం కింద మౌలిక సౌకర్యాల కల్పనుకు రూ.11 లక్షల 11 వేల కోట్లు కేటాయించినం. బంగారం, వెండి, ప్లాటినంపై కస్టమ్స్ ఛార్జీలను తగ్గించినం... ఇవన్నీ మచ్చుకు కొన్ని మాత్రమే.''అని వివరించారు. మరి కాంగ్రెస పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలైందని, 6 గ్యారంటీలను కూడా ఎందుకు అమలు చేయలేకపోయిందని ప్రశ్నించారు. 9 నెలల మీ పాలనలో నెరవేర్చిన హామీలపై సమాధానం చెప్పాలని, లేనిపక్షంలో ప్రజలు కాంగ్రెస్ ను క్షమించబోరని అన్నారు. మంగళవారం హైదరాబాద్.. నాంపల్లి లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర నాయకులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. మోదీ 100 రోజులపాటు రైతులు, యువత, మహిళలుసహా అన్ని వర్గాల అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ''రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంలో భాగంగా కనీస మద్దతు ధర పెంపు కోసం 2 లక్షల కోట్ల రూపాయలు కేటాయించినం. పీఎం కిసాన్ నిధి ద్వారా 9 కోట్ల 30 లక్షల మంది ఖాతాల్లో 20 వేల కోట్ల రూపాయలు జమ చేసినం. అట్లాగే మహిళల కోసం....'నారీ శక్తి' పేఎంఏవై కింద 3 లక్షల కోట్ల రూపాయలు కేటాయించినం. 2 లక్షల 35 వేల మంది స్వయం సంఘాలకు చెందిన 26 లక్షల మంది మహిళలను ఆదుకునేందుకు 5 వేల కోట్ల విలువైన బ్యాంకు రుణాలు మంజూరు చేసినం. 4 లక్షల 30 వేల స్వయం సంఘాలకు చెందిన 26 లక్షల మందికి 2 వేల 500 కోట్ల రివాల్వింగ్ ఫండ్ ను విడుదల చేసి ప్రయోజనం చేకూర్చినం. ముద్రా రుణాల పరిమితిని 10 లక్షల నుండి 20 లక్షల రూపాయలకు పెంచినం''అని వివరించారు. ''యువత అభ్యున్నతిలో భాగంగా 4 కోట్ల 10 లక్షల మంది యువతకు లాభం చేకూర్చేందుకు 2 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీని ప్రకటించినం. వెయ్యి ఐటీఐలను అప్ గ్రేడ్ చేసి 20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి ఉద్యోగ, ఉపాధి కల్పించాలని ప్రణాళిక రూపొందించినం.75 వేల కొత్త వైద్య సీట్లు ప్రవేశపెట్టినం.''అని పేర్కొన్నారు. అలాగే సామాజిక సంక్షేమంలో భాగంగా దేశంలోని 63 వేల ఆదివాసీ, గిరిజన గూడెల్లోని 5 కోట్ల మంది ఎస్టీల ఆర్థిక స్థితిగతులు మార్చే ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్లకు సంవత్సరానికి 5 లక్షల రూపాయల వరకు ఆరోగ్య కవరేజ్ అందించేందుకు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని విస్తరించి 6 కోట్ల మందికి లబ్ధి చేకూరుస్తున్నట్లు వివరించారు. బంగారం, వెండిపై కస్టమ్స్ డ్యూటీని 6 శాతానికి, ప్లాటినంపై 6.4 శాతానికి తగ్గించిన విషయాన్ని గుర్తు చేశారు. మౌలిక వసతులు, కనెక్టివిటీ కోసం..3 లక్షల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాజెక్టులను రూపొందించినట్లు తెలిపారు. 50 వేల 600 కోట్ల రూపాయలతో 8 నేషనల్ హైస్పీడ్ రోడ్ కారిడార్లను ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. న్యాయంపై దృష్టి సారించి మూడు కొత్త క్రిమినల్ చట్టాలు ప్రవేశపెట్టడంతోపాటు పేపర్ లీక్‌లను నివారించేందుకు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ ను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# రాజీవ్ గాంధీపై ప్రేముంటే గాంధీ భవన్‌లో విగ్రహం ఎందుకు పెట్టలేదు?: నిరంజన్ రెడ్డి



**విశ్వంభర, వనపర్తి :** కేవలం ఢిల్లీ నాయకులను సంతృప్తి పరచడానికి, తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవం దెబ్బ తీసేలా రాష్ట్ర సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా వనపర్తి పట్టణంలోని జమ్మి చెట్టు చౌరస్తా నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. గోపాల్ పేట మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించాలని నిర్ణయించిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ పట్ల మాకు గౌరవం ఉంది. దేశం కోసం ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి పట్ల మాకు సానుభూతి ఉంది. రాజీవ్ గాంధీ మీద అంత ప్రేమ ఉంటే 30ఏండ్లుగా గాంధీ భవన్ ఎదుట విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.అంబేద్కర్ సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం ఇష్టం లేకనే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆవిష్కరణ రాలేదన్నారు. అంబేద్కర్ సచివాలయం, అమరవీరుల స్థూపం మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని గత కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికలు రావడంతో సాధ్యం కాలేదు. వచ్చే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం, రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్‌కు తరలించి అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు.

# పటేల్‌తో బీజేపీకి సంబంధమే లేదు

- స్వాతంత్ర పోరాటంలో, హైదరాబాద్ విలీనంలో ఆ పార్టీకి ఎటువంటి పాత్ర లేదు
- సర్ధార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య సమరయోధుడు, నెహ్రూకు అత్యంత సన్నిహితులు
- ప్రజాపాలన దినోత్సవంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- గాంధీ భవన్ లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**విశ్వంభర, హైదరాబాద్:** సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌తో బీజేపీ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్ప ష్టం చేశారు. దేశ స్వాతంత్య్ర పో రాటంలో గానీ, హైదరాబాద్ విలీనంలో కానీ బీజేపీకి ఎలాంటి పాత్ర లేదని , అప్పటికి అసలు బీజేపీ పార్టీనే పుట్టలేదని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గాంధీభవన్ లో టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రు, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజాపాలనలో విలీనమైన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వాతంత్య్రానంతరం దేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశంలోని అన్ని సంస్థానాలను విలీనం చేయాలని నాటి కేంద్ర హోంమంత్రి, ఆయనకు అత్యంత సన్నిహితులైన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను కోరినట్లు తెలిపారు. సర్ధార్ వల్లభ్‌భాయ్ పటేల్ స్వాతంత్య్ర సమరయోధుడు, నాటి ప్రధాని నెహ్రూకు అత్యంత సన్నిహితులని ఆయన పేర్కొన్నారు. నేడు బీజేపీ పార్టీ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తోందని, మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని ఆరోపించారు. హైదరాబాద్ విలీనంలో ఎలాంటి పాత్రలేని బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి నీతులు చెప్పాల్సిన అవసరం లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకమైన సోనియా గాంధీని, వారి కుటుంబాన్ని కించపరచడం బీఆర్ఎస్ పార్టీ నీతిమాలిన చర్యలకు పరాకాష్ట అని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బలమురి వెంకట్, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, పలువురు,కార్పొరేషన్ చైర్మన్ లు, అధికార ప్రతినిధులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి!

## దిల్లీ మూడో మహిళా సీఎంగా బాధ్యతలు చేపట్టనున్న ఆతిశీ



దిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. ఆప్ శాసనసభా పక్ష నేతగా మంత్రి ఆతిశీని ఎన్నుకున్నట్లు ఎల్జీకి కేజ్రీ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ముంగిట ఆప్ ఫైర్ బ్రాండ్ ఆతిశీ మార్లీనా దిల్లీ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టనున్నారు. దిల్లీకి ఆతిశీ ఎనిమిదో సీఎం, మూడో మహిళా సీఎం కావడం విశేషం. అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా అరెస్టయిన నాటి నుంచి జైలులో ఉన్న సమయంలో ఆద్మీ పార్టీ తరఫున ఆతిశీనే అత్యంత కీలకంగా వ్యవహరించిన సంగతి అందరికి తెలిసిందే.అందుకే కేజ్రీవాల్‌కు వారసురాలిగా ఆతిశీనే తిరుగులేని ఛాయిస్ కావడానికి చాలా కారణాలున్నాయి! అవేంటి, ఆమె జీవిత విశేషాలపై విశ్వంభర వ్యాసం..

**స్ప్రింగ్‌డేల్ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు..**

తిశీ మార్లీనా సింగ్, 1981 జూన్ 8న జన్మించారు. ఆతిశీ తల్లిదండ్రులు విజయ్ సింగ్, త్రిప్తా వాహి దిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లు. మార్క్స్, లెనిన్ కలయికతో ఆమెకు ఆతిశీ మార్లీనా అని పేరు పెట్టారు. ఆతిశీ పూసా రోడ్డులోని స్ప్రింగ్‌డేల్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. సేయింట్ స్టీఫెన్స్ కాలేజీ నుంచి 2021లో డిగ్రీ పట్టా అందుకున్నారు. చీవ్‌నింగ్ స్కాలర్‌షిప్‌తో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో 2003లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2005లో ఆక్స్‌ఫర్డ్‌లోని మాగ్ డాలెన్ కాలేజీలో రోడ్స్ స్కాలర్‌గా ఉన్నారు. ఆతిశీ కొంతకాలం ఆంధ్రప్రదేశ్‌లోని రిశి వ్యాలీ స్కూల్‌లో చరిత్ర, ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేశారు. ఆతిశీ మధ్యప్రదేశ్‌లోని ఒక చిన్న గ్రామంలో ఏడు సంవత్సరాలు గడిపారు. అక్కడ ఆమె సేంద్రీయ వ్యవసాయం, ప్రగతిశీల విద్యా వ్యవస్థపై.. లాభాపేక్ష లేని సంస్థలతో కూడా పని చేసింది. టీచర్, సామాజిక కార్యకర్త, ఎంపీ, మంత్రిగా మంచి పేరు తెచ్చుకున్నారు.

**ఆప్ ఆవిర్భావం నుంచి పార్టీలోనే..**

ఆతిశీ ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. 2013లో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరడంతో ఆతిశీ రాజకీయ జీవితం ప్రారంభమైంది. పార్టీ విధి విధానాలు, రూపకల్పనలో ఆమె క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆమె పార్టీతో పాటు దిల్లీ ప్రభుత్వంలో అనేక బాధ్యతలు నిర్వర్తించారు.ఆమ్ ఆద్మీ పార్టీలో ఆతిశీ తనదైన ముద్రవేశారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ మేనిఫెస్టోను రూపొందించడంలో, పార్టీ ప్రాథమిక పాలసీలు రూపొందించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు.2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆమె ఆప్ అధికార ప్రతినిధిగా నియమించారు. దిల్లీలోని కల్కాజీ ప్రాంతానికి ఆప్ ప్రతినిధిగా, ఆప్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యురాలిగా పని చేశారు. ఈస్ట్ దిల్లీ లోక్‌సభ నియోజకవర్గంలో పార్టీని ముందుండి నడిపించారు.2015లో మధ్య ప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లాలో జరిగిన చారిత్రాత్మక జల సత్యాగ్రహంలో ఆతిశీ పాల్గొన్నారు. ఈ దీక్షతో సంబంధమున్న ఆప్ నాయకుడు, కార్యకర్త అలోక్ అగర్వాల్‌కు ఆమె సంపూర్ణ మద్దతును ప్రకటించారు.2015 జులై నుంచి 2018 ఏప్రిల్ వరకు విద్యాశాఖకు అడ్వైజర్‌గా పనిచేశారు. 2019లో తూర్పు దిల్లీ లోక్‌సభ నుంచి పోటీ చేశారు. అయితే, ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి, మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ చేతిలో 4.77లక్షల ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. 2020లో దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి కల్కాజీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ధరమ్‌వీర్ సింగ్‌పై 11 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అలా పార్టీ వ్యవహారాల్లో పట్టు సాధించిన ఆతిశీ, గోవాలో ఆప్ చీఫ్‌గా వ్యవహరించారు.

**విద్యారంగం సాధించిన విజయాల్లో క్రెడిట్ ఆమెదే**

ఆ పార్టీ ప్రభుత్వంలో విద్యారంగం అగ్రస్థానానికి ప్రముఖ స్థానం ఉన్నది. విద్యారంగం సాధించిన విజయాల్లో క్రెడిట్ ఆతిశీకే దక్కుతుంది. ఆమె గతంలో ఉపాధ్యాయురాలిగా సేవలందించిన ఆమె.. దిల్లీలో ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరుచడంలో ముఖ్య భూమిక పోషించారు. 2015 జులై నుంచి 2018 ఏప్రిల్ వరకు విద్యాశాఖకు అడ్వైజర్‌గా పనిచేశారు.విద్యాశాఖ మంత్రిగా పని చేసిన మనీష్ సిసోడియాకు ఆమె ఎంతగానే సహకారం అందించారు. ఆయనకు సలహాదారుగా ఉంటూ పలు వ్యూహాలను రూపొందించారు. దిల్లీలో ప్రభుత్వం విద్యా వ్యవస్థను మెరుగుపరడానికి తీవ్రంగా కృషిచేశారు. విద్యా శాఖ మంత్రిగా దేశ రాజధాని దిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చడంలో ఆమె కీలకంగా వ్యవహరించారు. దిల్లీలోని విద్యాసంస్థలు ఆతిశీ సారథ్యంలో గణనీయంగా మెరుగుపడ్డాయని రాజకీయ





విశ్లేషకులు చెబుతున్నారు. కొన్ని నివేదికల ప్రకారం, దిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, విద్యాహక్కు చట్టం ప్రకారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయడం, ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచకుండా నిబంధనలను పటిష్ఠం చేయడం, స్కూల్ కరికులంలో "హ్యాపీనెస్" పాఠ్యాంశాలను రూపొందించడంలో ఆమె ముఖ్యమైన పాత్ర పోషించారు.ఆతిశీ 2022లో న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో 'పట్టణ పాలనకు ఢిల్లీని ప్రపంచ నమూనా హైలెట్ చేస్తూ ప్రసంగించారు.

అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా అరెస్టయిన నాటి నుంచి జైలులో ఉన్న సమయంలో ఆద్మీ పార్టీ తరఫున ఆతిశీనే అత్యంత కీలకంగా వ్యవహరించిన సంగతి అందరికి తెలిసిందే.మనీష్ సోసిడియా, అరవింద్ కేజ్రీవాల్ జైళ్లకు వెళ్లిన సమయంలో అటు పార్టీని, ఇటు ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపించారు. శక్తివంతమైన నాయకురాలిగా ఈ సమయంలోనే ఆమె ఎదిగారు. ఆప్ రాజ్యసభ ఎంపి స్వాతి మాలివాల్, అరవింద్ కేజ్రీవాల్ అనుచరుడు బిభవ్‌కుమార్‌పై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో ప్రతిపక్షపార్టీలు ఆప్ పార్టీని తీవ్రంగా విమర్శించినా... ఆ విమర్శలను ఆమె ధీటుగానే ఎదుర్కొన్నారు.వేసవిలోదిల్లీలో నీటి సంక్షోభంతో ప్రజలు అల్లాడిపోయారు. ఆ సమయంలో ఆమె పొరుగు రాష్ట్రమైన హర్యానా నుంచి నీటిని తెప్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్రం పట్టించుకోకపోవడంతో ఆమె దిల్లీ ప్రజల కోసం నిరాహారదీక్ష చేపట్టారు. సాహసోపేతమైన ఈ చర్యతో కేజ్రీవాల్ స్థానాన్ని ఆమె భర్తీ చేశారు. దీంతో కేజ్రీవాల్ తన వారసురాలిగా అతిశీని ఎంపిక చేశారు.

**ఆమె ముందు ఎన్నోసవాళ్లు..**

దిల్లీలోలో ఇప్పటి వరకు ఏడుగురు సీఎంలుగా పని చేశారు. ఇందులో ఇద్దరు మహిళలు సీఎం పీఠాన్ని అధిష్టించారు.ఇంతకు ముందు బీజేపీ నుంచి సుష్మా స్వరాజ్, కాంగ్రెస్ నుంచి షీలా దీక్షిత్ ఢిల్లీ ముఖ్యమంత్రులుగా పని చేశారు.బీజేపీ దివంగత నాయకురాలు సుష్మా స్వరాజ్ 1998 అక్టోబర్ 12 నుంచి.. అదే సంవత్సరం డిసెంబర్ 3 వరకు అంటే దాదాపు 52 రోజుల పాటు సీఎంగా పని చేశారు. షీలా దీక్షిత్ ఎక్కువ కాలం సీఎంగా పని చేశారు. షీలా దీక్షిత్ 1992 డిసెంబర్ 3 నుంచి 2023 డిసెంబర్ 28 వరకు 15 సంవత్సరాల 25 రోజుల పాటు సీఎంగా సేవలందించారు. సుష్మాస్వరాజ్, షీలా దీక్షిత్ తర్వాత దిల్లీ ముఖ్యమంత్రిగా పదవిచేపట్టనున్న మూడో మహిళగా 43 ఏళ్ల ఆతిశీ చరిత్ర సృష్టించనుంది. దిల్లీ మద్యం పాలసీ కేసులో బెయిల్‌పై కేజ్రీవాల్ విడుదలైన విషయం తెలిసిందే. అయితే, అధికారిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, దస్త్రాలపై సంతకాలు చేయొద్దంటూ సుప్రీంకోర్టు పలు ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో ఆయన రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు.దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా అనంతరం ఆప్ శాసనసభాపక్షం అతిషి పేరును ఏక్రగీవంగా ఆమోదించారు. ఈ క్రమంలోనే ఆతిశీ దిల్లీ సీఎంగా ఎన్నికయ్యారు.దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు కొద్దినెలల ముందే ముఖ్యమంత్రి మార్పు చర్చనీయాంశమైంది. సిఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. మహిళా సమ్మాన్ యోజన, ఎలక్ట్రిక్ వెహికల్ 2.0 పాలసీ వంటి కీలక ప్రాజెక్టులు, పాలసీలను ఆమోదింపజేసుకోవడానికి ఆమె క్యాబినెట్ సమావేశాలను నిర్వహించాల్సి ఉంటుంది.

**ఆతిశీ చేతిలో 11 మంత్రిత్వ శాఖలు..**

మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2023 మార్చి 9న మంత్రి అయ్యారు. కేజ్రీవాల్ కేబినెట్‌లో ఏకైక మహిళా మంత్రిగా ఆర్థిక, ఎడ్యుకేషన్, పబ్లిక్ వర్క్స్, పవర్, రెవెన్యూ, లా, ప్లానింగ్, సర్వీసెస్, ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిసిటీ, విజిలెన్స్ శాఖలను నడిపించారు. ప్రస్తుతం కేజ్రీవాల్ కేబినెట్‌లో అత్యంత కీలకమైన 11 శాఖలు ఆతిశీనే పర్యవేక్షిస్తున్నారు.దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో అరెస్ట్ అయినప్పటి నుంచి ఆమ్ ఆద్మీ పార్టీలో కీలకంగా మారారు. ఆప్ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో సభ్యులుగానూ ఉన్నారు. దిల్లీ లిక్కర్ స్కామ్‌లో మనీశ్ సిసోదియా అరెస్ట్ అయిన తర్వాత విద్యాశాఖ మంత్రిగా ఆతిశీ బాధ్యతలు తీసుకున్నారు. .ప్రస్తుతం ఆమె ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. తాజాగా సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్నారు.





**-పోతుగంటి వెంకటరమణ,**
న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌ఛార్జి
(వీ3 న్యూస్, విశ్వంభర)
సెల్: 6304475133

# విధానాల్లో స్థిరత్వం..నిర్ణయాల్లో దృఢత్వం

**మోదీ వందరోజుల పాలనలో విధానాలు, ప్రాధాన్యాలు ఇలా**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదరణ గురించి మనం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. సామాన్య కార్యకర్త నుంచి ముఖ్యమంత్రిగా.. ప్రధానమంత్రిగా ఎదిగారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా.. మూడు సార్లు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వరుసగా మూడో సారి ప్రధానమంత్రిగా ప్రజా సేవలో కొనసాగుతున్నారు.. ఇటు దేశ రాజకీయాలైనా.. అటు ప్రపంచ సమస్యలైనా.. ఆయన స్పందించే విధానం అందరినీ ఆకట్టుకుంటుంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందిరితో ఆయన మెలిగే విధానం, స్పందించే గుణం.. ఇవన్నీ కూడా ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాయి..సెప్టెంబర్ 17తో ఎన్‌డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ముందే, 100 రోజుల అజెండాను ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి నిర్ణయించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యాలు వివరించారు. విధానాల్లో స్థిరత్వం చూపుతూ నిర్ణయాల్లో దృఢత్వాన్ని ప్రదర్శిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో మోదీ వంద రోజుల పాలనపై ప్రత్యేక వ్యాసం .

**రూ.15 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్**

మోదీ ప్రభుత్వం 3.0లో తొలి 100 రోజుల్లో దాదాపు రూ.15 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వేలు, భద్రత, ఇంధనం, సాంకేతికత వంటి అనేక రంగాలలో ఈ ప్రాజెక్టులకు మోదీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 25,000 గ్రామాలను రోడ్డు నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన మొదటి 100 రోజులలో రూ. 3 లక్షల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఆమోదించింది. వీటిలో 25,000 గ్రామాలను రహదారి నెట్‌వర్క్‌తో అనుసంధానించారు. మహారాష్ట్రలోని వాధావన్‌లో ఓడరేవు నిర్మాణం ఉన్నాయి.

**ప్రజ సంక్షేమంతోపాటు, ఆర్థిక అభివృద్ధికి ఊతం**

ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఏడాది జూన్ 9న వరుసగా మూడోసారి పదవీ బాధ్యతలు స్వీకరించారు. విధానపరంగా స్థిరత్వాన్ని అందించడంపై మోదీ ప్రభుత్వం దృష్టి సారించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారి వెన్నుచూపని




విదేశాంగ విధానం కలిగిన ప్రభుత్వాన్ని ప్రపంచం చూస్తోంది. ప్రధాన భావనను పలుచన చేయకుండా అధిగమించడానికి కొన్ని మార్పులను అనుసరించడానికి అనువైన విధానాన్ని అవలంభించారు. దేశ ప్రజ సంక్షేమంతోపాటు, ఆర్థిక అభివృద్ధికి ఊతం ఇచ్చే ఎన్నిక సంస్కరణలు తీసుకువచ్చారు. దీనికి ఉదాహరణగా గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ ఇందులో సంఘర్షణలను తగ్గించడానికి 140 మార్పులు చేశారు. 76,200 కోట్ల రూపాయల వ్యయంతో మహారాష్ట్రలోని భారీ వాధావన్ ఓడరేవుకు ఎన్‌డిఎ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇది ప్రపంచంలోని టాప్ 10 పోర్టులలో ఒకటిగా నిలవనుంది. ప్రధాన్ మంత్రి గ్రామీణ సడక్ యోజన-4 కింద, రూ. 49,000 కోట్ల కేంద్ర సహాయంతో 25,000 గ్రామాలను మెటల్ రోడ్లతో అనుసంధానించడానికి 62,500 కి.మీ రోడ్లు, వంతెనల నిర్మాణానికి అప్‌గ్రేడేషన్ ఆమోదించింది. వీటిలో చాలా గ్రామాల జనాభా 100 లోపు ఉంది.

రూ. 50,600 కోట్ల పెట్టుబడితో భారతదేశ రహదారి నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఆమోదించింది. ఇందులో 936 కి.మీ విస్తరించి ఉన్న ఎనిమిది జాతీయ హై-స్పీడ్ రోడ్ కారిడార్ ప్రాజెక్టుల ఆమోదం కూడా ఉంది. లడఖ్‌ను హిమాచల్ ప్రదేశ్‌ను కలిపే షింఖున్-లా సొరంగం నిర్మాణ పనులను ప్రారంభించడానికి ప్రధాని మోదీ మొదటి విడత ఆమోదం లభించింది. రైలు మార్గంలో వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కోసం ఎనిమిది కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీని ద్వారా 4.42 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

**వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు**

కొత్త జాతీయ సహకార విధానానికి సంబంధించిన ముసాయిదాను జాతీయ స్థాయి కమిటీ తయారు చేసి తుదిరూపు దాల్చుతోంది. ప్రభుత్వం 'అగ్రిసూర్' అనే కొత్త ఫండ్‌ను కూడా ప్రారంభించింది. ఇది వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు సృష్టించనుంది. వ్యవసాయ రంగంలో స్టార్టప్‌లు, గ్రామీణ పరిశ్రమలకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది. మౌలిక సదుపాయాలతోపాటు, ప్రభుత్వం వ్యవసాయంపై కూడా దృష్టి సారించింది. ఈ కాలంలో ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర (MSP), ఉల్లి, బాస్మతి బియ్యంపై కనీస ఎగుమతి ధర తొలగించడం, కనీస ఎగుమతి ధర తొలగించడం వంటివి చేసింది. ముడి తాటి, సోయాబీన్, పొద్దుతిరుగుడు నూనెలపై దిగుమతి సుంకాన్ని పెంచింది. ఈ 100 రోజులలో, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత విడుదల చేయడం జరిగింది. దీంతో పాటు మధ్యతరగతి వారికి రూ.7 లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి పన్ను లేకుండా ఉపశమనం కల్పించారు. స్టార్టప్‌లకు ఉపశమనం ఇస్తూ ఏంజెల్ పన్ను రద్దు చేసింది మోదీ సర్కార్. ముద్ర రుణ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. అదే సమయంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 3 కోట్ల ఇళ్లు మంజూరయ్యాయి. యువత ఉపాధి, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించేందుకు రూ.2 లక్షల కోట్ల ప్యాకేజీని ప్రకటించారు.మోదీ ప్రభుత్వం 3.0 అధికారంలోకి వచ్చిన మొదటి 100 రోజుల్లో 11 లక్షల మంది కొత్త లఖ్‌పతి దీదీలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఇప్పటి వరకు, వార్షిక ఆదాయం రూ.లక్ష కంటే ఎక్కువ ఉన్న 1 కోటి లక్‌పతి దీదీలకు సర్టిఫికెట్లు అందించారు. దీనితో పాటు, మోదీ ప్రభుత్వం 3.0 లో, 70 లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న సీనియర్ సిటిజన్లు అందరికీ రూ. 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమాను అందించాలని ఇటీవలేప్రకటించింది

విశ్వంభర V3 NEWS

# నిమజ్జన కార్యక్రమంలో పోలీసుల వైఖరి ఆక్షేపణీయం



**విశ్వంభర, మెట్ పల్లి:** గణపతి నవరాత్రులలో గణనాధునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నిమజ్జనానికి తీసుకు వెళితే హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పోలీసులు ప్రవర్తిస్తున్నారని బీజేపీ సీనియర్ లీడర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ అన్నారు. సోమవారం జరిగిన నిమజ్జన కార్యక్రమంలో భాగంగా యంగ్ స్టార్ అసోసియేషన్ వాహనాన్ని వట్టి వాగు వద్ద ఆపారు. పోలీసు శాఖ వినాయకుని ప్రతిమతో ఒకరు లేదా ఇద్దరు వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారని పోలీసులు ఊరేగింపు వాహనాన్ని ఆపడంతో చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది యంగ్ స్టార్ అసోసియేషన్ సభ్యులు గత 50 సంవత్సరాల నుండి వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నామని హిందూ సంప్రదాయ ప్రకారం సభ్యులందరం కలిసి నిమజ్జనం చేస్తామని పదే పదే వేడుకున్నారు. కలెక్టర్ రూల్ ఆదేశాల ప్రకారం నిమజ్జన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భక్తులు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. యంగ్ స్టార్ యూత్ సభ్యులు కలసికట్టుగా నిమజ్జనం చేస్తాం అని భీష్మించి కూర్చున్నారు. మండపాల నిర్వాహకులతో ముందు ఎందుకు చెప్పలేదు అందరు పోవడానికి కలెక్టర్ పర్మిషన్ అవసరమని సుఖేందర్ గౌడ్ నిలదీశాడు. మాట్లాడిన తర్వాత నిమజ్జనానికి అనుమతించడంతో యంగ్ స్టార్ అసోసియేషన్ సభ్యులు అందరూనిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.



(విశ్వంభర, షాద్ నగర్): షాద్ నగర్ ఆర్డీఓ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం జాతీయ జెండాను ఆవిష్కరించిన ఆర్డీవో వెంకట మాధవరావు, తహసీల్దార్, మరియు కార్యాలయ సిబ్బంది.

## స్వచ్ఛతా హీ సేవ పై అవగాహన కల్పించాలి

### మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్



**విశ్వంభర, షాద్‌నగర్:** స్వచ్ఛత అందరి బాధ్యతని షాద్ నగర్ మున్సిపాలిటీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ 2024 కార్యక్రమం పై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కమిషనర్ వెంకన్నతో కలిసి పాల్గొని మాట్లాడారు. పట్టణ ప్రజలందరూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ ఎలాంటి చెత్తాచెదారాన్ని వేయొద్దని సూచించారు. పట్టణ పరిశుభ్రతలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అక్టోబర్ 2 వరకు నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం పై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

## పాలాభిషేకం చేసిన కల్వకుంట్ల విద్యాసాగర్ రావు



**విశ్వంభర,జగిత్యాల:** సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహా ఆవిస్కరణనని వ్యతిరేకిస్తు ఈ రోజు మెట్ పల్లి పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసిన జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రావు మాట్లాడుతూ తెలంగాణ తల్లి కోసం కేటాయించిన స్తానంలో కేవలం రాజకీయ దురుద్దేశంతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టి తెలంగాణ తల్లిని అవమానించారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన కాంగ్రెస్ పార్టీకి రేవంత్ రెడ్డికి రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ చైర్మన్ రణవేణి సుజాత సత్యనారాయణ, వైస్‌చైర్మన్ బోయిన్‌పల్లి చంద్రశేఖరరావు, మారు సాయి రెడ్డి, ఎల్లాల దశరథ్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అస్తిత్వం కాపాడుకుందాం



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రజల అస్థిత్వపు ఆత్మ గౌరవ ప్రతీకైనా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు సంబంధమే లేని రాజీవ్ గాంధీ విగ్రహం నిలపడం సిగ్గుమాలిన చర్య అని చైతన్య పురి డివిజన్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్ అన్నారు. చైతన్య పురి ప్రభాత్ నగర్ లోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ కార్పొరేటర్ విఠల్ రెడ్డితో కలిసి మహేష్ యాదవ్ పాలాభిషేకం చేసి, పూలమాల వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్రటేరియట్, అమరజ్యోతి మధ్య తెలంగాణతల్లి ఉండాలని ప్రతి తెలంగాణపౌరుడి ఆకాంక్ష, అలాంటి చోట కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ విగ్రహం పెట్టి మనోభావాలు దెబ్బతీసి గాయపరిచారని అన్నారు. ఆత్మ గౌరవం కోసం వేలాది ప్రాణ త్యాగాలు, అలుపెరగని పోరాటాలు చేసి సాధించిన తెలంగాణను మళ్ళీ ఢిల్లీకి గులాం అంటూ బానిసలుగా మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రాయాస పడుతుందని తెలిపారు. తెలంగాణ అస్తిత్వంకు ప్రమాదం ఏర్పడితే తెలంగాణ ప్రజలుచూస్తూ ఊరుకోరని, కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డి అహంకారంకు బుద్దిచెప్పడం తథ్యం అన్నారు. డివిజన్ సీనియర్ నాయకులు చంద్ర శేఖర్ రెడ్డి, శివ ప్రకాష్, జయ శ్రీ, పవన్, రమణా రెడ్డి, గట్టు శ్రీనివాస్, సంతోష్, ప్రవీణ్ చారి, రవి యాదవ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాంచందర్ నాయక్



**విశ్వంభరం, మహబూబాబాద్:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతో రాంచందర్ నాయక్. పాల్గొన్న జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్, ఎస్పి సుధీర్ ఆర్ కేకన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, డిఎఫ్ఓ బి.విశాల్, జిల్లా అధికారులు, పుర ప్రముఖులు, పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

## గఢీల కోటలను బద్దలు కొట్టి రాచరిక పాలనకు స్వస్తి



**విశ్వంభర, వర్ధన్నపేట:** వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ ఛైర్మన్ అంగొతు అరుణ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించిన గౌరవ వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గడీల కోటలను బద్దలు కొట్టి రాచరికపు పాలనకు స్వస్తి పలికి ప్రజలందరికీ ప్రజాపాలన అందిస్తున్న శుభసందర్భంగా నేడు మనం ప్రజాపాలన దినోత్సవం జరుపుకుంటున్నామని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, మహిళ, యూత్‌కాంగ్రెస్ నాయకులు మరియు వివిధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ కమిషనర్ మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు: ఎస్పీ రూపేష్



**విశ్వంభర, సంగారెడ్డి:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉదయం 8:30 గంటలకు జిల్లా యస్.పి. రూపేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి, సిబ్బందితో కలిసి జాతీయ గీతాలపన చేసి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులకు, సిబ్బందికి, జిల్లా ప్రజలందరికి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. 1947 ఆగస్టు15న భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలోనే ఉండేది. ఆనాటి కేంద్ర హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో నిర్వహించిన ఆపరేషన్ పోలో విజయవంతమై, 1948 సెప్టెంబర్ 17 సాయంత్రం 5 గంటలకు మీర్ ఉస్మాన్ అలీఖాన్ రేడియో ద్వారా ఉపన్యాసం ఇస్తూ హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో అంతర్భాగం అని ప్రకటించారన్నారు. అప్పటి వరకు నిజాం నిరంకుశ పాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం కావడం జరిగింది. కావున ఈ రోజును మనం "తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం"గా జరుపుకుంటున్నాం అన్నారు. ఉద్యోగంలో చేరినమొదటి రోజు ఏ విధంగానైతే సమాజసేవ చేయాలని ఉత్సాహంగా విధులలో చేరామో, అదేఉత్సాహం చివరివరకు కొనసాగించాలన్నారు. తమకు కేటాయించిన విధిని సక్రమంగా నిర్వర్తించినప్పుడే దేశానికి సేవ చేసినవారం అవుతామని, ప్రతి ఒక్కరు తమ విధిని శ్రద్ధగా, అంకిత భావంతో నిర్వర్తించి, దేశ సేవలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ. సంజీవరావ్, సంగారెడ్డి డి.యస్.పి. సత్తయ్య గౌడ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇ.కళ్యాణి, యస్.బి. ఇన్స్పెక్టర్ విజయకృష్ణ, డి.సి.ఆర్.బి. ఇన్స్పెక్టర్ బి.రమేష్, ఐ.టి. ఇన్స్పెక్టర్ రమేష్ ఆర్.ఐ.లు రామరావ్, డానియోల్, యస్.బి, డి.సి.ఆర్.బి. యస్.ఐ.లు సూపరింటెండెంట్ లు అశోక్, వెంకటేశం, సిబ్బంది పాల్గొన్నారు.

## గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే

**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో శివ మారుతి అయ్యప్పస్వామి దేవాలయంలో గణనాథునికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు లస్కర్ ఆంజనేయులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంక ర్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, నేతలు చెంది తిరుపతి రెడ్డి, అగ్గనూర్ బస్వం, విజయ్ కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కొప్పునూరి ప్రవీణ్, మనీష్, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి




విశ్వంభం,నాంపల్లి: అత్యవసర సమయంలో శస్త్ర చికిత్సలు నిర్వహించే రోగులు క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని షైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ముస్తఫా అన్నారు. మిలాద్ ఉన్ నబి పండుగను పురస్కరించుకొని జాంబాగ్ లోని సయ్యద్ ఇబాద్ ఉల్లాషా ఖాద్రి సంబంధించిన మసీదు ప్రాంగణంలో షైన్ వెబ్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మసీదులో ప్రార్ధన అనంతరం యువకులు పెద్ద సంఖ్యలో రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సొసైటీ ప్రతినిధి జాన్ డిసౌజ రక్తదానం చేసిన దాతలను అభినందించి పండ్లు, జ్యూస్ అందజేశారు. రక్తదాన శిబిరం విజయవంతం చేసేందుకు సహకరించిన మసీదు సభ్యులకు దక్కన్ బ్లడ్ బ్యాంక్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయకుని నిమజ్జనంలో అపశ్రుతి



**విశ్వంభర, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండల పరిధిలోని లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన భోజయ్య (25) స్నేహితులతో వినాయకుని నిమజ్జనంకు వెళ్లి ఊర్లో ఉన్న చెరువులో ప్రమాదవశాత్తు పడడంతో అక్కడక్కడనే మృతి చెందాడు.

## ఆకట్టుకున్న హరినామ సంకీర్తన



**విశ్వంభర, జడ్చర్ల:** గణేష్ నవరాత్రులలో భాగంగా జడ్చర్ల క్రొత్త బస్టాండ్ ఆవరణలో మండపం వద్ద సోమవారం రాత్రి షాద్‌నగర్ శ్రీ కళాజ్యోతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక హరినామ సంకీర్తన చేశారు. ప్రముఖ జానపద, రంగస్థల, నటులు సాహిత్య కళాకారులు మాజీ ఎమ్మెల్సి శ్రీ గోరేటి వెంకన్న ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. కళాజ్యోతి సభ్యులతో శ్రీ గోరేటి భక్తి పాటలు ఆలపించారు. కళాజ్యోతి షాద్ నగర్ సభ్యులను అభినందించారు. వినాయక నవరాత్రుల్లో పదిరోజులుగా శ్రీ కళాజ్యోతి షాద్ నగర్ వారు గణపతి మండపాలవద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భజన, హరికథ కాలక్షేపం నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో సభ్యులు రమేశ్ చారి, వీరాచారి, ఆంజనేయులు యాదవ్ శ్రీకాంత్ చారి, సిద్దు చారి, లక్ష్మయ్య, వెంకటయ్య, సత్యనారాయణ, పాల్గొన్నారు.

## ఆరోపణలపై ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ వివరణ

**విశ్వంభర, హైదరాబాద్:** ఇటీవల తమ సంస్థపై వచ్చిన ఆరోపణలపై ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ వివరణ ఇచ్చింది. ఒక ట్రావెల్ ఏజెన్సీ కారణంగా చాలా మంది నష్టపోయాని తెలిపింది. "అబుదాబి యూఏఈ లోని నేషనల్ థియేటర్‌లో సెప్టెంబరు 15న జరిగిన మా ఇటీవలి గ్లోబల్ కన్వెన్షన్ 2024 విజయవంతంగా ముగిసిందని తెలపడానికి సంతోషిస్తున్నాం.. ఇందులో ప్రపంచవ్యాప్తంగా 1100 మంది పాల్గొన్నారు. వీరిలోలో మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, పలువురు ప్రముఖ వ్యాపార ప్రముఖులు ఉన్నారు. అయినప్పటికీ హైదరాబాద్‌లోని లోటస్ ట్రావెల్స్ డిఫాల్ట్ కారణంగా మా వేడుక మసకబారింది.చాలా మంది వ్యక్తులు నష్టపోయారు. మేం ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. బాధిత సభ్యులతో ఐక్యంగా ఉంటాం. ప్రభావితమైన వారందరికీ మేం మా హృదయపూర్వక మద్దతు, తెలుపుతున్నాం. డబ్ల్యూ.ఎ.ఎం నాయకత్వ బాధ్యులు జవాబుదారీగా ఉండాలని పోరాడుతాం. పరిష్కరించడానికి, బాధితులకు పరిహారం ఇవ్వడానికి త్వరగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. తక్షణమే మేం అన్ని నిజమైన క్లెయిమ్‌లను పరిశీలించడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. . వారు తమ డబ్బును, లోటస్ ట్రావెల్స్ ప్యాకేజ్ అమౌంట్, కన్వెన్షన్ ద్వారా చెల్లించిన రిజిస్ట్రేషన్ రుసుమును వీలైనంత త్వరగా తిరిగి పొందుతారు' అని ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు రామకృష్ణ టంగుటూరి , ప్రధాన కార్యదర్శి డా. పీ.ఎం. రావు తెలిపారు.



విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వబ్రాహ్మణులు ఏర్పాటు చేసిన ఊరేగింపును షాద్ నగర్ పట్టణంలోని శివమారుతి దేవాలయం వద్ద ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్. -విశ్వంభర, షాద్ నగర్

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

**విశ్వంభర, వికారాబాద్:** ఎంతో మంది త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి, జాతీయ జెండా ఆవిష్కరణ గావించారు. తెలంగాణ గీతాలాపన అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వాతంత్రం మన సొంతం కావడానికి ఎంతోమంది ఈ గడ్డమీద అసమాన త్యాగాలు చేశారన్నారు. దేశమంతా 1947 ఆగస్టు 15 న స్వాతంత్ర సంబరాలు జరుపుకుంటుంటే, హైదరాబాద్ ప్రజలు మాత్రం స్వేచ్ఛా స్వాతంత్రానికి పోరాడుతూనే ఉన్నారని ఆయన తెలిపారు. నిజాం నిర్బంధానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు చైతన్యవంతులై సాయుధ రైతాంగ పోరాటం చేసి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయ హస్తం హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ హామీల అమలుకు గ్రామాల్లో, వార్డుల్లో సభలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల నుండి 2 లక్షల 84 వేల లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించి వివిధ పథకాలకు అర్హులైన వారిని గుర్తించడం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద ఇప్పటికే 1 కోటి 79 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందారని, దీని వల్ల మహిళలకు 65 కోట్ల రూపాయల ఆదా అయ్యారని తెలిపారు. అదే విధంగా 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్ ను అందించే దిశగా ఇప్పటికీ 1 లక్షా 20 లబ్ధిదారులను గుర్తించి 1 కోటి 73 లక్షల రూపాయల గ్యాస్ సబ్సిడీ అందించడం జరిగిందని ఆయన తెలిపారు. గృహ జ్యోతి పథకం ద్వారా సున్నా విద్యుత్ బిల్లు వచ్చిన లబ్ధిదారులకు ఆగస్టు వరకు 1 లక్షా 26 వేల వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇవ్వడం జరిగిందని, విద్యుత్తు అందించిన డిస్కంలకు 12 కోట్ల 53 లక్షల రూపాయలను ప్రభుత్వం చెల్లించిందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీల మేరకు 2 లక్షల రుణ మాఫీ మేరకు 1 లక్షా 9 వేల మంది రైతులకు 905 కోట్ల రూపాయల రుణ మాఫీ చేయడం జరిగిందని అన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా 3,200 మంది చికిత్సలు చేయడం జరిగిందని దీనికి ప్రభుత్వం 4 కోట్ల 60 లక్షల రూపాయలను చెల్లించడం జరిగిందని ఆయన తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో భాగంగా 1062 పాఠశాలలకుగాను 924 పాఠశాలల్లో పనులు ప్రారంభించి 792 పాఠశాలల్లో అన్ని రకాల పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మిగతా పాఠశాల పనులు పురోగతిలో ఉన్నాయి. వీటికి 17 కోట్ల 23 లక్షల రూపాయలను చెల్లించడం జరిగిందని తెలిపారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో 337 ఇళ్ళు దెబ్బతినగా ఒక్కో ఇంటికి 16,500 చొప్పున మొత్తం 55 లక్షల 60 వేల రూపాయలను తక్షణ సహాయం కింద అందజేయడం



జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుటకు అందరి సహకారం కావాలని ఆయన ఆకాంక్షించారు. కలెక్టరేట్ లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా సంఘం లక్ష్మి భాయ్, కొత్తగడి సాంఘిక సంక్షేమ, సంగం లక్ష్మీబాయి, మైనార్టీ గురుకుల పాఠశాల, బండి వెనుకచర్ల గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినిల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థినిలకు సభాపతి చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. అదేవిధంగా జిల్లాలోని 278 మహిళా స్త్రీనిధి కింద సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 26 కోట్ల 76 లక్షల రూపాయలను, ప్రధానమంత్రి స్వానిధి కింద బ్యాంకు లింకేజీ కింద 15 కోట్ల రూపాయల చెక్కులను సభాపతి అందజేశారు. తెలంగాణ ప్రజాపాల దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, పరిగి, తాండూర్, చేవెళ్ల శాసనసభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, బి.మనోహర్ రెడ్డి, కాలే యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## చిట్కుల్‌లో ప్రజా పాలన దినోత్సవం



**విశ్వంభర, పటాన్‌చేరు:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అభివృద్ధి జరుగుతుందని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంగళవారం సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకొని చిట్కుల్ గ్రామపంచాయతీ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద జరిగిన ఉత్సవాల్లో నాయకులు, అధికారులతో కలిసి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సంధర్బంగా నీలం మధు మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా పాలననడుస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, సమ న్యాయం ప్రధాన ఎజెండాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. దొరల కబంధ హస్తాల నుంచి తెలంగాణకు విముక్తి కల్పించిన ఈ రోజును తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటూ, ఇందిరమ్మ పాలన దిశగా ప్రజాపాలన కొనసాగిస్తున్న రేవంత్ ప్రభుత్వం ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి చేస్తూ మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణంతోపాటు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు రెండు లక్షల రైతు రుణమాఫీ, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించిన ఘనత రేవంత్ సర్కార్కు దక్కుతుందన్నారు. ప్రజా పాలనలో భాగంగా నూతన రేషన్ కార్డుల మంజూరుతో పాటు తెలంగాణలో ప్రతి కుటుంబానికి పూర్తి ఆరోగ్య వివరాలతో హెల్త్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బాల శౌరీ, ఈవో కవిత, వి.నారాయణ, వెంకటేశ్, మురళీ, పొట్టి నారాయణ రెడ్డి, వెంకటేష్, శ్రీను, గోపాల్, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

## బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదానం



**విశ్వంభర,కామారెడ్డి:** జిల్లా కేంద్రంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ నందు బీజేవైఎం ఆధ్వర్యంలో రక్త దానం చేయటం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణా తార మాట్లాడుతూ నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు 15 రోజుల పాటు పక్షోత్సవాలు నిర్వహించనున్నమని అన్నారు. అందులో భాగంగా స్వచ్ఛత అభియాన్, రక్త దాన శిబిరాలు, హెల్త్ క్యాంపులు నిర్వహణ, బీజేపీ సభ్యత్వ డ్రైవ్ నిర్వహణ, పోటో ఎగ్జిబిషన్ లు, కళాశాల, పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, నరేంద్ర మోది సేవాభావం గురించి మేధావులతో సదస్సులు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. విశ్వ గురువుగా భారత్ ను నిలపడం కోసం గత 10 సంవత్సరాలుగా అహర్నిశలు కష్ట పడుతున్న నరేంద్ర మోదికి దేశ ప్రజల ఆశీస్సులు ఎప్పటికీ ఉంటాయని వారు అవినీతి రహిత భారత్ కోసం, దేశం కోసం ధర్మం కోసం ఇలాగే ఎప్పుడు ఆరోగ్యంవతులుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు.

## డ్రైవర్లు, కండక్టర్లు బాగా కష్టపడాలి

**విశ్వంభరం, మహబూబాబాద్:** తెలంగాణ ప్రజా పాలన ఆదేశాల మేరకు మహబూబాబాద్ డిపో లో డిపో మేనేజర్ శ్రీ ఎం శివప్రసాద్ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మాట్లాడుతూ డిపో యొక్క స్థితిగతులు రీజియన్‌లో మహబూబాబాద్ డిపో యొక్క స్థానము, మనము తీసుకోవలసిన జాగ్రత్తల గురిచి చర్చించారు. కండక్టర్ డ్రైవర్లు ఇంకా ఎక్కువగా కష్టప డాలని తెలియజేశారు. సూపర్డెంట్ పి శ్యాం ప్రసాద్, మల్లికార్జున, ఎడిసిలు సారయ్య, బిజీ మూర్తి, పాపిరెడ్డి, సెక్యూరిటీ ఇంచార్జ్ సత్యనారాయణ, డిపో ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల హెల్త్ కమిటీ సభ్యునిగా సామల శ్రీనివాస్




**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ రాష్ట్ర టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎగ్జిక్యూటివ్ మీటింగ్లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరహత్ అలీ, రామ్ నారాయణలు కలిసి తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల హెల్త్ కమిటీ సభ్యులుగా సామల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు భూపాలపల్లి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్ తెలిపారు. గతంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా సేవలందిస్తున్నందుకు గుర్తించి రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్. తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల హెల్త్ సమస్యలపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారికి సేవలు చేసే విధంగా ఈ యొక్క హెల్త్ కమిటీ పనిచేస్తుందని అధ్యక్ష కార్యదర్శులు విరహత్ అలీ, రామ్‌నారాయణ అన్నారు. తనఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు క్యాతం సతీష్ కుమార్, శామంతుల శ్యామ్ కుమార్‌కు జిల్లాశాఖకు సామల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేసారు.

## రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్యలోకి వచ్చాం

### రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వేడుకల్లో వేం నరేందర్ రెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** తెలంగాణ విమోచనం కొరకు ఎంతో మంది సమరయోధులు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడి భారతప్రభుత్వంలో విలీనం అయ్యేలా కృషి చేశారని సీఎంసలహాదారు నరేందర్ రెడ్డి గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు సహా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిపాల్గొన్నారు. కేఎల్ఆర్ మాట్లాడుతూ నిజాం నవాబు పాలనకు విముక్తి కలిగి ప్రజాస్వామ్య స్వేచ్ఛ వాయువులు పీల్చుకున్న రోజు సెప్టెంబర్ 17 అన్నారు. తెలంగాణను సాధించుకుని స్వయం పాలన దిశగా అడుగులు వేస్తూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సాగుతుందన్నారు. పేదలకు, అర్హులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూతెలంగాణసర్వతోముఖాభివృద్ధి అయ్యేలా చర్యలు తీసుకుంటుందని కిచెన్ గారి లక్ష్మారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు సహా స్థానికులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాలోని ఏజెన్సీ మండలాల జర్నలిస్టల ఇంటిస్థలాలు, పక్కాగృహాల సమస్యను పరిష్కరించాలని, జిల్లాలోని 18మండలాల్లో జర్నలిస్ట్లకు ఇంటిస్థలాలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి, రాష్ట్రఅధ్యక్షులు విరాహత్ అలీతో కలిసి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లా ప్రధానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు గందసిరి రవిలు వినతిపత్రం సమర్పించారు.



## కేబుల్ చోరీ కేసులో ఇద్దరు దొంగలు అరెస్టు




**విశ్వంభర, ఆమనగల్లు:** వరుస వైర్ల దొంగతనాలు చేస్తున్న ఇద్దరినీ ఆమనగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ శివారున గల సోలార్ ప్లాంట్ లో దాదాపు 10 వేల రూపాయల విలువ గల కేబుల్ వైర్ దొంగిలించారు అని సీఐ ప్రమోద్ కుమార్ తెలిపారు. జూలై 20న పిర్యాదు రాగా దర్యాప్తు లో బాగంగా నిందితులు వజ్రగిరి సత్యరాజు అలియాస్ ఎరుకలి రాజు తండ్రి బాలస్వామి(25) వజ్రగిరి తండ్రి మధు(22) జల్సాలకు డబ్బులు సరిపోక నిందితుల కుటుంబ సభ్యులు జట్టుగా ఏర్పడి దొంగతనాలు చేసి సంపాదించాలనే ఉద్దేశ్యంతో ముందు వ్యవసాయ బొరెవెల్ మోటర్స్ ని దొంగిలించి అందులో ఉన్న కాపర్ వైర్ అమ్మి వచ్చిన డబ్బులను అందరూ సమానంగా పంచుకునేవారు. అట్లా చేసిన దొంగతనాల వల్ల వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో పెద్ద దొంగతనాల ద్వారా సంపాదించాలని సోలార్ కరెంట్ తయారయ్యే ప్లాంట్ లలో కాపర్ వైర్ ఎక్కువ దొరుకుతుందని అలా ఎక్కడెక్కడ సోలార్ ప్లాంటులు ఉన్నాయో రెక్కి నిర్వహించి పథకం ప్రకారం జులై నెలలో మేడిగడ్డ శివారున గల సోలార్ ప్లాంట్ లో దాదాపు 10 వేల రూపాయల విలువ గల కేబుల్ వైర్ దొంగిలించారని సీఐ అన్నారు. ఈ కేసు నమోదు చేసి విచారణలో అన్నీ రకాల సాంకేతికను ఉపయోగించి పక్క ఆధారలు సేకరించి వారిని పట్టుకున్నామని అయితే ఈ ముఠా గతంలో మొత్తం 9 దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. మిడ్జిల్ పరిధిలో 4, కల్వకుర్తి పరిధిలో 1, అడ్డకల్ పరిధిలో 1, చిన్నచింతకుంట పరిధిలో 1,మక్తల్ పరిధిలో 1 ఇలా పలు దొంగతనాలు చేశారని అయితే మంగళవారం సెల్ టవర్‌లలో బ్యాటరీలు దొంగతనం చేయాలని వజ్రగిరి సత్యరాజు అలియాస్ ఎరుకలి సత్య రాజు, వజ్రగిరి మధు ఇద్దరు అమనగల్ కీ వచ్చి సెల్ టవర్ కొరకు వెతుకుతూ సేవలాల్ గుట్టవద్ద అనుమానాస్పదంగా తిరుగుచూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టుగా సీఐ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ కేసులో జిబి. వెంకటేష్ అమనగల్ ఎస్సై, శ్రీకాంత్ ఎస్సై తలకొండపల్లి, కానిస్టేబుళ్లు శివ కుమార్, రఘు, జాషువా నేరస్తులను పట్టుకున్నందుకు ఉన్నతాధికారులు అభినందించారు.

## ప్రజాపాలనా దినోత్సవం



విశ్వంభర,రామన్నపేట: 1948 సెప్టెంబరు 17న నిజాం రాచరిక పాలన ముగిసి తెలంగాణలో ప్రజాస్వామిక పాలన శకం ఆరంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17ను "తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం" నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది.రామన్నపేట మండలం పల్లివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రజాపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ఎగురవేసిన తదుపరి విద్యార్థులు తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం వినూత్నంగా సెప్టెంబరు 17 ఆకారంలో కూర్చొని "తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవం వర్ధిల్లాలని" నినాదాలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధారాణి, ఉపాధ్యాయులు పాల్వంచ హరికిషన్,రఘురాం రెడ్డి, జయశ్రీ, నిర్మాలాదేవి, కృష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం



**విశ్వంభర, రామన్నపేట:** తెలంగాణ విమోచన దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా రామన్నపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద బీజేపీ మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. దేశం మొత్తం స్వతంత్ర దినోత్సవం జరుపుకుంటుంటే, తెలంగాణ రాష్ట్రానికి మాత్రం రజాకార్ల పాలనలో బందీ అయిన సందర్భంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ నవాబుల మెడలు వంచి తెలంగాణ రాష్ట్రం ఈ దేశంలో అంతర్భాగం అని చెప్పి సెప్టెంబర్ 17న తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో అంతర్భాగం చేయడం జరిగింది. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవంగా జరుపుకోవాలని భారతీయ జనతా పార్టీ పిలుపునిచ్చింది. దేశం కోసం, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వనం అంజయ్య, దావనూరు వెంకటేశం, మునిపంపుల మాజీ సర్పంచ్ కట్ట యాదయ్య, సీనియర్ నాయకులు భాషా, కండ్ల నరేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మధ్యపురి ఐలయ్య, మండల అధ్యక్షులు కంబాలపల్లి సైదులు, వివేకానంద శక్తి కేంద్రం ఇంచార్జ్ బద్దుల మల్లేశం బీజేవైఎం నాయకులు మధు, మచ్చ గిరి, ఇతర కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ బ్యారేజ్‌కు తగ్గిన వరద

### 85 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బరాజ్‌లో వరద ప్రవాహం తగ్గింది. ఎగువన ఉన్న మహారాష్ట్రలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద ప్రవాహం క్రమంగా తగ్గూతూ వస్తోంది. సోమవారం 1,75,430 క్యూసెక్కులు రాగా, మంగళవారం 1,48,950 క్యూసెక్కులకు తగ్గింది. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత ప్రవాహం రివర్ బెడ్ నుండి 90.70 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.



# అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



**విశ్వంభర, భూపాలపల్లి:** అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర అటవీ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సెప్టెంబర్ 17, 1948లో తెలంగాణ నాటి హైదరాబాదు సంస్థానం భారతదేశంలో ఐక్యమై 76 సంవత్సరాలు పూర్తి చేసుకుని 77వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా తెలంగాణ ప్రజాపాలన వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. 1948, సెప్టెంబర్ 17న సువిశాల భారతదేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు స్వతంత్ర్య భారతావనిలో అరవై ఏండ్ల స్వీయ అస్థిత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నదని అన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దార్శినిక పాలనలో విద్యుత్తు, నీటిపారుదల, వ్యవసాయ, పరిశ్రమలు, ఉద్యోగ ఉపాధికల్పన, వైద్య, విద్య అభివృద్ధి సంక్షేమంతో పాటు ఐటి నుండి అగ్రికల్చర్ వరకు అన్ని రంగాల్లో ఘణనీయమైన అభివృద్ధిని సాధిస్తూ అనతికాలంలోనే సంక్షేమ కార్యక్రమాలు అమలులో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు హామీలను అమలు చేసి ప్రజల పట్ల తమకు గల అంకితభావాన్ని చాటుకున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ సేవలను 10 లక్షలకు పెంచడం, రైతు రుణమాఫీ, గృహాజ్యోతి, గృహాలక్ష్మి వంటి పథకాలు అమలు పట్ల ప్రజలలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ప్రజాపాలన పేరిట అభయహస్తం గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీ వార్డులకు అధికారులను పంపి గత సంవత్సరం డిసెంబర్ 28 నుండి జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించామని, సుపరిపాలనపై దృష్టి సారించిన ప్రజా ప్రభుత్వం తొలుత వనరులు, పథకాల అమలుతీరును విశ్లేషించుకుని, గత ప్రభుత్వ పాలనలో కుప్పకూలిన వ్యవస్థలను చక్కదిద్దే పనిని ప్రారంభించినట్లు తెలిపారు. వాస్తవ పరిస్థిని ప్రజలకు వివరించాలన్న లక్ష్యంతో పారదర్శక పాలన అందించడంలో భాగంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, విద్యుత్ రంగాలపై శ్వేత పత్రాలను విడుదల చేశామన్నారు. ఇంతకాలం ప్రజలకు అందుబాటులో లేని ప్రగతిభవన్ అధికారంలోకి వచ్చిన వెనువెంటనే ముళ్లకంచెల చెర నుంచి విముక్తి కలిగించి జ్యోతి రావు పూలే ప్రజాభవన్ గా నామకరణం చేసి ప్రజల కోసం ద్వారాలు తెరిచామని అన్నారు. ఆరు గ్యారంటీలను ఈ రాష్ట్రంలో ఉన్న పేదలు, నిరుపేదలను దృష్టిలో పెట్టుకుని మాట ఇవ్వడం జరిగిందని, ఈ ఆరు గ్యారంటీలను నిక్కచ్చిగా అమలు చేసి తెలంగాణ ప్రజలకు ఒక సంక్షేమ రాజ్యంగా, అభివృద్ధి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. చివరి వరుసలోని పేదలకు కూడా అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులు స్వీకరించామని, ప్రతి పథకానికి వేర్వేరు దరఖాస్తులు అవసరం లేకుండా ఏ పథకానికి అర్హులైన వారు ఆ పథకానికి దరఖాస్తు చేసేందుకు వీలుగా ఒకే దరఖాస్తును అందుబాటులోకి తెచ్చామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు



**(విశ్వంభర,ఎల్బీనగర్):** ఆర్కెపురం డివిజన్ వాసవి కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుని మండపం వద్ద ఆర్కే పురంలోని ఆర్టిస్టిక్ క్లిక్ ది ప్రీ స్కూల్ చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న వాసవి కాలనీ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు.స్కూల్ ప్రిన్సిపాల్ నీలిమ, చక్రీజాక్సన్, వాసవికాలనీ సంక్షేమసంఘంసభ్యులు ఉన్నారు.

## విశ్వకర్మ జయంతి వేడుకలు



**విశ్వంభర, కర్మన్‌ఘాట్:** విశ్వకర్మ జయంతినీ పురస్కరించుకొని శ్రీ విశ్వకర్మ వెల్ఫేర్ అసోసియేషన్ కర్మన్‌ఘాట్ డివిజన్ జెడ్ పి రోడ్‌లో జెండా ఆవిష్కరణ చేశారు. వెల్పర్ అసోసి యేషన్ అధ్యక్షుడు వెంకటాచారి జండా ఆవిష్కరించారు. సభ్యులు శంకరాచారి, రవీంద్రచారి, మద్నాచారి, రవిచారి, కుమార్ చారి, చంద్రశేఖర్ చారి, వెల్ఫర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## లడ్డూ వేలం



**విశ్వంభర,హైద్రాబాద్ :** బిఎన్ రెడ్డి నగర్ లోని రంగారెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ నందు సోమవారం నిర్వహించిన వినాయక ఉత్సవాలు చివరిరోజు జరిగిన లడ్డు వేలంలో బాలరాజు అనే భక్తుడు 55,116 రూపాయలకు వేలం పాడి పొందారు. స్వామి వారి పట్టు పంచె బి. ప్రేమ్ రాజ్ రు.4,116 రూపాయలకు తీసుకున్నారు. ఈ కార్యక్రమములో అధ్యక్షులు రంగారెడ్డి రవీందర్ రెడ్డి, రాజేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## దేవుని సన్నిధిలో పుట్టినరోజు వేడుకలు



**విశ్వంభర, వికారాబాద్ :** ఆలంపల్లిలోని 23వ వార్డు కౌన్సిలర్ ప్రభావతి సురేష్ గౌడ్ దంపతుల కుమార్తె పుట్టిన రోజు వేడుకలను గణేషుడి చెంత మండపంలో భక్తుల మధ్య జరుపుకున్నారు.

## మహాగణపతి రుద్రహెూమం



**విశ్వంభర,లింగాల:** విఘ్నాలు తొలగి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ లింగాలలోని 13వ వార్డులో వినాయక మండపంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడికి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, మహ గణపతి రుద్ర హెూమం నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన లింగాలతో పాటు వివిధ గ్రామాలలో వాడవాడలా ప్రత్యేక మండపాలలో ప్రతిష్టించిన విఘ్నేశ్వరుడికి పదో రోజు సోమవారం పూజలు కొనసాగాయి. 13 వ వార్డులో గణరుద్ర యూత్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహ దాత నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మండల కాంగ్రెస్ నాయకులు ఉల్లంగొడ్ల రాజు దంపతులు భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి గణపతికి ఇష్టమైన కుడుములను సమర్పించారు. అనంతరం వేద పండితులు సుదర్శనాచార్యులు వేద మంత్రోచ్చరణల మధ్య గణపతి పంచరత్నవళి, ఉపనిషత్తు గణపతి స్తోతిస్తూ మాసానికి ఒక జంట చొప్పున సంవత్సరానికి 12 మంది దంపతులచే మహా రుద్ర హెూమం భక్తులు తిలకిస్తుండగా భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ప్యారం సంపత్ కుమార్ ప్రవీణ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు నరసింహ, వెంకటేష్, నరేష్ ,మహేష్, కార్తీక్, రాకేష్, సాయి, తేజ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## ఫోర్త్ సిటీ పనులకు త్వరలో శ్రీకారం



**విశ్వంభర, మహేశ్వరం:** హైదరాబాద్ మహానగరంగా అభివృద్ధి జరగబోతుందని పదేపదే కేఎల్ఆర్ చెప్పిన మాటలు నిజం కాబోతున్నాయి. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కాసేపు భేటీ అయ్యారు కేఎల్ఆర్. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఫోర్త్ సిటీలో విద్య, వైద్య, మెట్రో, రహదారుల అభివృద్ధిపై కేఎల్ఆర్ విజన్ తో వెళ్తున్నారని దానికి అనుగుణంగా భవిష్యత్‌లో పనులను ప్రారంభిస్తామని కలెక్టర్ శశాంకశర్మ, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. మహేశ్వరం మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా మార్చితే మరింత అభివృద్ధి చెంది మౌలిక వసతుల కల్పన పెరుగుతుందని కిచ్చెన్న చెప్పారు. విదేశాల్లో ఉన్న మెరగైన విద్యసంస్థలను ఫోర్త్ సిటీలో నెలకొల్పి మన విద్యార్థులకు నైపుణ్యాలను పెంచుతామని కే.లక్ష్మారెడ్డి అన్నారు. భూముల విలువ భారీగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రజాప్ర తినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, కృష్ణానాయక్, కాకి ఈశ్వర్ ముదిరాజ్, రాజునాయక్ సహా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆమనగల్లులో వేడుకగా గణేష్ నిమజ్జనం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల కేంద్రంలో సోమవారం రాత్రి గణేష్ ఉత్సవ కమిటీలు గణనాథుని నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దాదాపు 100 గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయకుడి లడ్డును వేలం పాటలో పాల్గొని లడ్డులను భక్తులు దక్కించుకున్నారు. అనంతరం యువకులు వుట్ల కార్యక్రమం నిర్వహించారు. పురవీధుల గుండా ఊరేగింపుగా యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ మహిళల కోలాటాల మధ్య శివపుత్రుడుని ఆమనగల్లు సురసముద్ర గంగమ్మ ఒడికి చేర్చి నిమజ్జనం నిర్వహించారు. సోమవారం రాత్రి చాలా వరకు విగ్రహాలు నిమజ్జనం అయినట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు. సీఐ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు, యువతి యువకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూను దక్కించుకున్న జీఆర్ఎల్ సంతోష్ గుప్త



**విశ్వంభర, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలోని సంకష్ట వినాయక హౌసింగ్ బోర్డ్ ఆలయంలో గత వినాయకునికి నవరాత్రులు పూజ చేసిన లడ్డును వేలమేయ్యగా 2.79 లక్షలకు కామారెడ్డి ట్రాన్స్పోర్ట్ అధినేత జి ఆర్ ఎల్ ఓనర్ సంతోష్ గుప్తా ఈ లడ్డు వేలంలో దక్కించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆ స్వామివారి కృప వల్ల అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఇలానే రాబోయే కాలంలో కూడా స్వామివారి ప్రసాదం దక్కించుకోవాలని ఆయన తెలిపారు.

## రూ.2,01,00 పలికిన గణేశుని లడ్డూ.. వేలంపాటలో దక్కించుకున్న జల్లా చంద్రశేఖర్



విశ్వంభర, కొత్తపేట: కొత్తపేట సెంటర్లోనున్న పీవీటా మార్కెట్ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో చివరిరోజు నిత్య పూజలు, హెూమము, కుంకుమార్చన, భక్త బృందం చే భజనలు, అన్నదానం ఘనంగా నిర్వహించారు. అనంతరం లడ్డూ వేలం వేశారు. అయితే లడ్డు వేలం పాట లో పల్లవి హ్యాండ్లూమ్స్ యజమాని జల్లా చంద్రశేఖర్ రూ.2,01,000/- తో లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పివిటి మార్కెట్ మర్చంట్ కమిటీ అధ్యక్షులు బీ. ధనుంజయ , ఉపాధ్యక్షులు బొడ్డు శ్రీధర్, కార్యదర్శిబీ. శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి టీ. కృష్ణ, కోశాధికారి చెరుకు బిక్షపతి, డైరెక్టర్లు: ప్రసాద్ కుమార్, సురేష్, రెడ్డయ్య, పోచయ్య, రాజేంద్రప్రసాద్, రచ్చ రాజు మరియు పలువురు కార్యనిర్వాహక ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైభవంగా గణేష్ నిమజ్జనం



**(విశ్వంభర, ఎల్బీనగర్):** సరూర్ నగర్ డివిజన్ కొత్త పెట్ లోని గణేష్ నిమజ్జన ఉత్సవాలల్లో భాగంగా వివిధ ప్రాంతాలల్లోని గణేష్ మండపాల నుండి నిమజ్జనానికి తరలివెళ్ళుతున్న గణనాథులకు గణేశ్ నిమజ్జన ఉత్సవ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికలో పాల్గొన్న మహాత్మా గాంధీ లా కాలేజ్ చైర్మన్ గంగుల గోవర్ధన్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, గణేశ్ నిమజ్జన ఉత్సవ కమిటీ చైర్మన్ కార్యదర్శిలు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



**విశ్వంభరా ఎల్బీనగర్:** విగ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలని చైతన్యపురి ప్రభాత్ నగర్ లోని సాయి మిత్ర బి ఎం అర్ ఎస్టేట్ నిర్వాహకులు అన్నారు. తొమ్మిది రోజులపాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పాటల పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. వినాయక పూజలో భాగంగా నిర్వహించిన హెూమం కార్యక్రమంలో సందీప్ రెడ్డి, ప్రవళిక దంపతులు, సత్యనారాయణ సుమిత్ర దంపతులు, శ్రీధర్ రెడ్డి శ్యామల దంపతులు, శశిధర్ రెడ్డి వసంత దంపతులు, రామారావు నీలిమ దంపతులు, మహేష్ గుప్తా సంధ్య దంపతులు, పుల్లారెడ్డి రోజా దంపతులు పాల్గొన్నారు.

## డాన్స్ మాస్టర్ చక్రి జాక్సన్ పూజలు



(విశ్వంభర, ఎల్బీనగర్): సరూర్నగర్ డివిజన్ హుడా కాంప్లెక్స్ సాయి కృష్ణ నగర్ లోని మూన్ వాకర్ డాన్స్ స్టూడియోలో ఏర్పాటు చేసిన గణనాథునికి చివరి రోజు విద్యార్థులతో కలిసి స్టూడియో నిర్వాహకుడు, డాన్స్ మాస్టర్ చక్రి జాక్సన్ పూజలు నిర్వహించారు. మినీ ట్యాంక్ బండ్ గణనాథుని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పెరియార్ ఇంటర్నేషనల్ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలి

**విశ్వంభర, హైదరాబాద్:** ద్రవిడ ఉద్యమ పితామహులు పెరియార్ రామస్వామి నాయకర్ ఇంటర్నేషనల్ స్టడీ సెంటర్ దేశ రాజధానిలో ఏర్పాటు చేయాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పెరియార్ జయంతి సందర్భంగా మంగళవారం బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో పెరియార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొరెల్లి సురేష్ మాట్లాడుతూ పెరియార్ ఆలోచన విధానాలు, రచనలు ఈ దేశానికి ఎంతో అవసరమని ఈ దేశంలో పెరిగిపోతున్న మూఢనమ్మకాల నిర్మూలన కోసం దేశ ప్రజలు విజ్ఞానం వైపు అడుగులు వేయాలంటే పెరియార్ రచనలు ఎంతో అవసరమని అన్నారు. అంబేద్కర్, పూలే, పెరియార్ భావజాలం వ్యాప్తి చేస్తున్న దళిత బహుజన మేధావులపై దేశవ్యాప్తంగా దాడులు పెరిగాయని ఈ దాడులను అరికట్టాలంటే దళిత బహుజన మేధావులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఎంతైనా ఉందని అన్నారు. శంభూకుని మొదలు బీఎస్పీ తమిళనాడు అధ్యక్షులు ఆర్మ్స్ట్రాంగ్ వరకు అనేక మంది దళిత బహుజన మేధావులపై హత్య రాజకీయాలు పెరిగాయి అని, దీని అరికట్టాలంటే కేవలం ఈ జాతి వర్గాలకు చెందిన మేధావులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. భావితరాల విద్యార్థులు విజ్ఞానం వైపు అడుగులు వేయాలంటే పాఠ్యపుస్తకాలలో పెరియార్ రచనలు పాఠ్యాంశాలుగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఆరె కంటి శ్రీకాంత్, దేవరకొండ నరేష్, నక్క మహేష్, రేవంత్, శ్రీనాథ్, ప్రసాద్, నందు, ఎండీ షాబాద్, నరసింహ, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## మట్టి మనుషుల తిరుగుబాటుతోనే నిజాం సర్కార్ నేలమట్టం: ఆప్ కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్



**విశ్వంభర,బషీర్‌బాగ్:** బానిసత్వానికి బలైపోయిన మట్టి మనుషుల తిరుగుబాటుతోనే నిజాం సర్కార్ నేలమట్టం అయిందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆప్ రాష్ట్ర కార్యాలయం వద్ద తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ దిడ్డి సుధాకర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బాంచెన్ దొర కాళ్ల మొక్కుతా అన్న జనమే బరిగీసి నిలిచారని, బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్ల పోతావ్ కొడుకో నైజాం సర్కరోడా అంటూ నినదించి, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాయుధ పంథాను సాగించి నిరంకుశ నిజాం పాలనను అంతం చేసారని గుర్తు చేశారు. దోపిడీ, అకృత్యాలకు పాల్పడుతున్న రజాకార్లను, దేశముఖ లను, దొరలను ఉరికించి కొట్టిన చరిత్ర తెలంగాణ గడ్డ సొంతం అని, దొడ్డికొమరయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగి వంటి వారు తొలితరం అమరులుగా నిలిచారని, వారి పోరాట స్ఫూర్తితోనే ప్రజాసమస్యలపై పోరాటాలు నిర్వహించాలని డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆప్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర కొర్ కమిటీ సభ్యులు బుర్రా రాములు గౌడ్, మహిళా వింగ్, అధ్యక్షురాలు హేమాజిల్లోజు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షురాలు డాక్టర్ లాక్ష్యా నాయుడు, ఫైనాన్స్ సెక్రటరి సోహైల్, అధికార ప్రతినిధి జావీద్ షరీఫ్, దివ్యాంగ వింగ్ అధ్యక్షులు దర్శనం రమేష్, నేతలు కొడంగల్ శ్రీనివాస్, మౌనికా గాజుల, అహసాన్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, కేశంపేట:** భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా కేశంపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు రొల్ల రఘురాం గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు లెంకపోతుల మధుసూదన్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు కంచుకోట నర్సింలు, బాయిగడ్డ ఐలయ్య, జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు మోటే శ్రీనివాస్, జిల్లా ఎస్సీ మోర్చఉపాధ్యక్షులు సిలివేరు లింగయ్య, పద్మ కృష్ణయ్య, తట్టేపల్లి నరసింహ, శివాజీ, బీజేవైఎం అధ్యక్షులు పాలాధి శ్రీనివాసులు, కొత్తింటి మల్లేష్, పాండురంగారెడ్డి, యుగంధర్, శక్తి కేంద్ర ఇన్చార్జిలు బుసమోని కృష్ణయ్య దాన గళ్ళ మహేష్, తదితరులు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనంత పద్మనాభ స్వామి వ్రతం



**విశ్వంభర, కొత్తూరు:** అనంత పద్మనాభ స్వామి చతుర్దశి వేడుకలు కొత్తూరు మండలం పెంజర్ల ఆలయంలో చైర్మన్ బెజవాడ అనిత రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనంత చతుర్దశిని అనంతపద్మనాభస్వామి వ్రతం అని కూడా పిలుస్తారని అన్నారు. భాద్రపద మాసంలోని శుక్లపక్ష చతుర్దశిని అనంత భగవానుడు ఉపవాసం పాటించడం ద్వారా జరుపుకుంటారని తెలిపారు. హిందూ మతంలో అనంత చతుర్దశి అనేది విష్ణువు యొక్క శాశ్వతమైన రూపాన్ని ఆరాధించడానికి ముఖ్యమైన రోజుగా పరిగణించ బడుతుందని అన్నారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మెండే కృష్ణ యాదవ్, మాజీ సర్పంచ్ వనం బాలరాజ్, పిఎసిఎస్ డైరెక్టర్ ఎమ్మె అజయ్, దేశాల భీమయ్య, దేశాల జైపాల్ పాల్గొన్నారు.

## టెండర్ ప్రైవేట్ వ్యక్తులకు..
### పనేమో మున్సిపల్ కార్మికులది



**విశ్వంభర, షాద్‌నగర్:** వినాయక నిమజ్జనం కోసం సుమారు 15 లక్షల ఆన్లైన్లో ప్రైవేట్ టెండర్ టెండర్ వేయడం జరిగింది. టెండర్ను దక్కించుకున్న వాళ్ళు నిమర్జనం ఏర్పాట్లకు సంబంధించి అన్ని సౌకర్యాలు కల్పించాలి. కానీ వినాయక నిమర్జనాలకు స్వాగతం పలికే స్టేజిను టెండర్ తీసుకున్న వాళ్ళు వేయకుండా మున్సిపల్ కార్మికులతో వేయించడం ఏమిటని ప్రజలు గుసగుస లాడుతున్నారు. టెండర్ తీసుకున్న వారే ప్రతి పని చేయాల్సి ఉంటుంది కదా మున్సిపల్ కార్మికులతో ఎందుకు చేయిస్తున్నారని మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే టెండర్ తీసుకున్న వారు ఏర్పాట్లకు దూరంగా ఉంటూ కార్మికులతో పని చేయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనికి సంబంధించి మున్సిపల్ కమిషనర్ వెంకన్నను వివరణ అడగగా మున్సిపల్ సిబ్బంది సహకరిస్తున్నారు తప్ప ప్రైవేటు వాళ్లే పని చేస్తున్నారని వివరణ ఇచ్చారు.

## సాయుధ పోరాటం మహత్తరం



**విశ్వంభర, చివ్వేంల:** నైజాం నిరంకుశ పాలకులైన జాగిర్దారులు, భూస్వాములు, పటేల్, పట్వార్లను వారి తాబే దారులను గ్రామాల నుండి పట్టణాలకు తరిమికొట్టిన మహత్తర పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ సంతోష్ కుమార్ అన్నారు. మంగళవారం ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం వస్తే తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17న స్వాతంత్రం వచ్చిందని అన్నారు. ఎన్నో వీరోచిత పోరాటాలు చేయడం వల్ల తెలంగాణకు స్వాతంత్రం వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఓ నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, మల్లేష్, ఆర్ ఐ శ్రావణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గణపతి ఉత్సవాల సందర్భంగా అన్నదానం



**విశ్వంభర, వికారాబాద్:** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆలంపల్లి 23వ వార్డ్ వినాయకుని దగ్గర కౌన్సిలర్ ప్రభావతి సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయకుని లడ్డు వేలంపాటలో పాల్గొని ఆలంపల్లికి చెందిన పాండు గౌడ్ 82 వేలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. 2వ లడ్డును 14,000 రూపాయలకు పద్మాకర్ గౌడ్ వేలం పాటలో పాల్గొని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలంపల్లి 23వ కౌన్సిలర్ ప్రభావతి సురేష్ గౌడ్ మాట్లాడుతూ వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు. విఘ్నేశ్వరుని కటాక్షంతో ప్రజలందరి విఘ్నాలు తొలగిపోవాలని విఘ్నేశ్వరుని వేడుకున్నానని అన్నారు.

## భువనగిరిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**విశ్వంభర, యాదాద్రి భువనగిరి:** గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. భువనగిరి పట్టణంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు జంఖాన్ గూడలో సోదాలు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన జహీర్ షేక్‌ను అదుపులోకి తీసుకుని అతని నుంచి వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం అతన్ని భువనగిరి స్టేషన్‌లో ఎక్సైజ్ సిబ్బందికి అప్పగిం చారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎవరైనా అక్రమంగా గంజాయిని విక్రయించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



## ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తాం
### త్వరలో పేదలకు కొత్త రేషన్ కార్డులు
### ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టనున్న సీఎం రేవంత్
### మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

**విశ్వంభర,మహేశ్వరం:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రజాపాలన దినోత్సవంగా అధికారికంగా జరుపుకోవటం సంతోషం అన్నారు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.ప్రతీ పేదవాడికి సర్కార్ సంక్షేమ పథకాలు అందించటమే కాంగ్రెస్ లక్ష్యమని కేఎల్ఆర్ అన్నారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల, ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో జరగని రుణ మాఫీ, రేషన్ కార్డుల మంజూరును కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టిందని లక్ష్మారెడ్డి గుర్తు చేశారు. అన్ని వర్గాలకు ప్రజాపాలన అంది స్తామని హామీ ఇచ్చారు కిచ్చెన్న. ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్ష లతోపాటు ఎలాంటి విఘ్నాలు లేకుండా వినాయక నిమజ్జనాలు జరుపుకోవాలని కేఎల్ఆర్ ఆకాంక్షించారు.



## వేలంలో లడ్డూ పొందిన ముస్లిం సోదరుడు

**విశ్వంభర,పరిగి:** పరిగి మండల పరిధిలోని బసిరెడ్డి పల్లి గ్రామంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు 11 రోజులు పూజలు అందుకున్నాడు. మంగళవారం గణనాథుని శోభాయాత్ర సందర్భంగా శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు లడ్డుకు వేలంపాట నిర్వహించారు. వేలం పాటలో మైనార్టీ సోదరుడు ఫయాజ్ 11,000 రూపాయలకు లడ్డూలు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ గణనాథుని వద్ద లడ్డు ను దక్కించుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు.



## పటేల్ కృషి మరువలేనిది

**విశ్వంభర,పరిగి:** ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం పరిగి పట్టణంలోని



పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్ఐ సంతోష్ కుమార్ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాచరిక పాలన ముగిసి భారత సమైక్యలో హైదరాబాద్ సంస్థానం భాగమై ప్రజాస్వామిక యుగంలోనికి ప్రవేశించిన సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజాపాలన దినోత్సవం జరుపుకోవడం జరిగిందన్నారు. హైదరాబాద్ సంస్థానం విలీనికరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి మరువలేనిదని అన్నారు. ప్రతి ఒక్కరు అతని ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ఐక్యమత్యంగా, దేశ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు కృష్ణ, రమేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ కొరకు పోరాడిన యోధులను స్మరించుకుందాం

**విశ్వంభర.మహబూబాబాద్:** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ మండలం పర్వతగిరి గ్రామం జడ్.పి.హెచ్.ఎస్ పర్వతగిరి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మందుల శ్రీరాములు జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ మన తెలంగాణ కోసం, మనకోసం, మన స్వేచ్ఛ కోసం, ప్రాణాలర్పించి పోరాడిన యోధులను స్మరించుకుందాం అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగమూర్తి, ఉపాధ్యాయ బృందం ఎన్ రవి, ఎన్ రవికుమార్, ప్రేమ్ కుమార్, కుమారాని, శ్రీనివాస్, ప్రభాకర్ రామాచారి, శ్రీలత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**(విశ్వంభర, సరూర్‌నగర్): వినాయక నిమజ్జనం సందర్భంగా సరూర్ నగర్ వినాయక**




**నిమజ్జన ప్రదేశానికి వస్తున్న భక్తులకు పుహోర ప్రసాదం, మంచి నీటిని పంపిణీ చేస్తున్న నర్సింహా చారి, క్రాంతి కుమార్, నరేష్ కుమార్, సాయి, రాజు, బాల్‌రాజ్ చారి తదితరులు.**

## తాగునీరు పంపిణీ



**విశ్వంభరా,ఎల్బీనగర్:** ఆన్ పాసివ్ సీ ఈ ఓఅష్ ముఫారెహ జన్మ దిన సందర్భంగా వినాయక చవితి నిమజ్జనం పురస్కరించుకొని ఆన్ పాసివ్ ఎఐ సంస్థ ఫౌండర్ కె.ఎల్.న్ బాబుజీ టీం సభ్యులతో కలిసి కొత్తపేటలోని వినాయక చవితి నిమ్మజ్జన సభ్యులకు టీం సభ్యులు స్వీట్స్, మంచినీరు పంపిణీ చేశారు. కె.ల్.న్‌బాబుజీ నేలంటి వేంకటేశ్వర్లు, రమణమూర్తి పీ.వీ, మొహమ్మద్‌బాషా,ప్రసాద్,రాజనాలశాస్త్రీ,రాజనాలదేవి,సుజాతరెడ్డి,శ్రీకాంత్‌దామెర పాల్గొన్నారు.



## పండుగలకు ముందు సామాన్యులకు షాక్.. భారీగా పెరుగుతున్న గోధుమ పిండి ధరలు!

**దిల్లీ:** పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఓ వైపు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అదే సమయంలో వంటనూనెల ధరలు సైతం పెరుగుతున్నాయి. తాజాగా గోధుమ పిండి ధరలు సైతం పెరుగుతుండడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. గత కొన్ని వారాలుగా గోధుమ పిండి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం గోధుమల సరఫరా తగ్గడమేనని తెలుస్తున్నది. హోల్‌సేల్ మార్కెట్‌లో పిండి ధరలు కనీసం 20శాతం వరకు పెరిగాయి. ధరల నుంచి ఊరట కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం గోధుమల నిల్వ పరిమితిని సవరించింది. త్వరలోనే దసరా, దీపావళి పండగలకు ముందు పిండి ధరల పెరుగుదల సామాన్యులకు కష్టాలు పెంచుతున్నాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో పిండి ధర క్వింటాల్‌కి రూ.2250 నుంచి రూ.2800 వరకు పెరిగింది. పిండి పెరుగుదల నేపథ్యంలో బ్రెడ్, మఫిన్స్, నూడుల్స్, పాస్తా, బిస్కెట్స్, కేక్, కుకీలు తదితర ఉత్పత్తుల ధరలపై సైతం ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పిండి ధరల పెరుగుదల నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా గోధుమల నిలువలు సరిపడా ఉన్నాయని పేర్కొంది. అతే కాకుండా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని వ్యాపారులు, టోకు వ్యాపారులు, చిల్లర వ్యాపారులు, చైన్ రిటైలర్స్, ప్రాసెసర్స్‌కు వర్తించే గోధుమల స్టాక్ పరిమితిని సవరించింది. 2024 రబీలో 1129 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలను సేకరించారు. గోధుమ నిల్వ పరిమితి పోర్టల్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం అన్ని గోధుమలను నిల్వ చేసే సంస్థలను కోరింది. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని పేర్కొంది. ఆయా స్టాక్ వివరాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అధికారులు పర్యవేక్షించనున్నారు.

### బాలీవుడ్ బ్యూటీ కంగనా రనౌత్‌కు
## చండీగఢ్ కోర్టుషాక్!
### విచారణకు కోర్టుకు రావాలని నోటీసులు..!



**చండీగఢ్:** బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు చండీగఢ్ కోర్టు షాక్ ఇచ్చింది. విచారణకు జిల్లా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. కంగనా కొత్త సినిమా ఎమర్జెన్సీపై దాఖలైన పిటిషన్‌ను మంగళవారం కోర్టు విచారించింది. ఈ సందర్భంగా నోటీసులు జారీ చేసింది. డిసెంబర్ 5న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కంగనాకు వ్యతిరేకంగా జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చండీగఢ్ ఎస్ఎస్‌పీని పిటిషన్ కోరారు. కంగనాపై జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్వకేట్ రవీందర్ సింగ్ బస్సీ పిటిషన్ దాఖలు చేశారు. కంగనా రనౌత్ కొత్త చిత్రం ఎమర్జెన్సీ సెప్టెంబర్ 6న విడుదల కావాల్సి ఉండగా.. నిషేధాన్ని ఎదుర్కొంటున్నది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం ఆధారంగా సినిమా తెరకెక్కుతున్నది. ఇప్పటికే ట్రైలర్ సైతం విడుదలైంది. మూవీ ద్వారా కంగనా సిక్కుల ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నించిందని అడ్వకేట్ రవీందర్ సింగ్ బస్సీ ఆరోపించారు. కంగనా చరిత్ర చదవకుండానే సిక్కులను నెగెటివ్‌గా చూపించిందని ఆరోపించారు. ఈ క్రమంలో మండి ఎంపీపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, పిటిషన్‌లో కంగనాతో పాటు స్క్రీన్ ప్లే రైటర్ రితేష్ షా, జీ స్టూడియోలను సైతం ప్రతివాదులుగా చేర్చారు. ఇదిలా ఉండగా.. ఎమర్జెన్సీ సినిమా విడుదలపై నిషేధం విధించాలని డిమాండ్ చేస్తూ మొహాలీకి చెందిన గురీందర్ సింగ్, గుర్మోహన్ సింగ్ పంజాబ్, హర్యానా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చిత్రంలో సిక్కులను తప్పుగా చిత్రీకరించారని ఆరోపించారు. సినిమా అలాగే విడుదలైతే సిక్కుల మనోభావాలు దెబ్బతింటాయని.. ఉద్దేశపూర్వకంగా సిక్కుల ప్రతిష్టను దిగజార్చాలనే ఉద్దేశ్యంతో సినిమా తీశారని ఆరోపించారు. నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి.. అందులో ఎస్‌జీపీసీ సభ్యులకు చోటు కల్పించాలన్నారు. విడుదలకు ముందే వారికి చిత్రాన్ని చూపించి.. వివాదాస్పద సన్నివేశాలను తొలగించి.. ఆ తర్వాత విడుదల చేయాలని పిటిషన్‌లో కోరారు.

## దారులన్నీ మూసుకుపోవడంతోనే అతిశీని అందలమెక్కించారు: మనోజ్ తివారీ

**దిల్లీ:** దిల్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేయడంలో చాలా జాప్యం జరిగిందని బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ అన్నారు. గత ఆరు నెలలుగా ఢిల్లీకి సీఎం అంటూ లేరని ఆవేదన వ్యక్తం చేశారు. మనోజ్ తివారీ మంగళవారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అరవింద్ కేజ్రీవాల్‌కు అహమే పెద్దదిగా కనిపిస్తుందని దుయ్యబట్టారు. ఇప్పుడు అన్ని దారులూ మూసుకుపోవడంతో గత్యంతరం లేక అతిశీకి అధికారం అప్పగించారని ఆరోపించారు. ఢిల్లీ ప్రజల ముందు తాను నిజాయితీపరుడిగా నిరూపించుకునేందుకు ఈ డ్రామాను తెరపైకి తెచ్చారని మండిపడ్డారు.ఆప్ పాలనలో ఢిల్లీ అధోగతి పాలైందని, 15 ఏండ్లుగా ఢిల్లీని కాంగ్రెస్ భ్రష్టు పట్టిస్తే పదేండ్లుగా ఆప్ ఢిల్లీ పరిస్థితిని మరింత దిగజార్చిందని ఆరోపించారు. నెలలో ఎన్నికలు నిర్వహించాలని ఆప్ కోరుకుంటే అందుకు బీజేపీ సిద్ధంగా ఉందని మనోజ్ తివారీ స్పష్టం చేశారు. కాగా, అరవింద్ కేజ్రీవాల్ స్థానంలో ఢిల్లీ నూతన సీఎంగా అతిశీ పాలనా పగ్గాలు చేపట్టనుండటంపై ఆప్ మంత్రి అమన్ అరోరా స్పందించారు. అరోరా మంగళవారం చండీఘడ్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.లిక్కర్ పాలసీ కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై విడుదలైన అనంతరం జవాబుదారీతనంలో కేజ్రీవాల్ ఇవాళ నూతన అధ్యాయాన్ని లిఖించారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు అత్యున్నతమైనదని, తనపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తిరిగి ప్రజల ముందుకు వెళ్లాలని కేజ్రీవాల్ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆప్‌నకు సీఎం పదవి కంటే విలువలు చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. కేజ్రీవాల్ జైలుకు వెళ్లిన అనంతరం ఆప్‌లో చీలికకు కాషాయ పార్టీ అన్ని రకాలుగా ప్రయత్నించిందని ఆరోపించారు.




# ఆకాశం ఊడిపడదు.. అక్టోబర్ ఒకటి వరకు ఆగండి..

- బుల్డోజర్ చర్యలపై ఆదేశం
- నైట్ షిఫ్ట్‌కు మహిళలను వద్దనలేం
- బెంగాల్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టిన సుప్రీం
- కోల్‌కతా డాక్టర్ కేసు విచారణ కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని నిలిపివేయాలి: కపిల్ సిబల్
- ఆపేది లేదన్న సర్వోన్నత న్యాయస్థానం..!
- చైనా జాతీయుడికి బెయిల్‌కు ఇచ్చేందుకు నిరాకరణ ధర్మాసనం
- దేశ అత్యున్నత న్యాయస్థానం నాలుగు కీలక తీర్పుల విచారణ



### నైట్ షిఫ్ట్‌కు మహిళలను వద్దనలేం..

నైట్ షిఫ్ట్‌లో పనిచేసే మహిళలను అడ్డుకోలేమని సుప్రీంకోర్టు తెలిపింది. రాత్రి పూట పని చేయకూడదని వాళ్లకు చెప్పలేమని కోర్టు స్పష్టం చేసింది. నైట్ షిఫ్ట్‌ల నుంచి మహిళా డాక్టర్లకు విముక్తి కల్పిస్తూ బెంగాల్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. మహిళలకు మినహాయింపులు అవసరం లేదని, వాళ్లకు కేవలం సమాన అవకాశాలు కావాలని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఘటనపై నమోదు అయిన సుమోటో కేసు విచారణ సమయంలో కోర్టు పేర్కొన్నది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ఈ కేసులో తీర్పునిచ్చింది. జస్టిస్ జేబీ పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. మహిళ భద్రత దృష్ట్యా.. మహిళా డాక్టర్లు రాత్రిపూట పనిచేయ వద్దు అని కోర్టులో కేసు దాఖలైంది.రాత్రిపూట పనిచేయవద్దు అని మహిళలకు ఎలా చెబుతాం, వాళ్లకు మినహాయింపులు కాదు, సమాన అవకాశాలు కావాలి, అన్ని పరిస్థితుల్లోనూ పనిచేసేందుకు మహిళా డాక్టర్లు ఆసక్తిగా ఉన్నారని, వాళ్లు కచ్చితంగా అన్ని పరిస్థితుల్లో పనిచేయాలని, బెంగాల్ సర్కారు తమ నిర్ణయాన్ని సరి చేసుకోవాలని, 12 గంటల షిఫ్ట్‌ను దాటేసి మహిళలు పనిచేయరాదు అని చెప్పలేమని, సైనిక దళాల్లో రాత్రి పూట పనిచేసే మహిళలు ఉన్నారని ధర్మాసనం తెలిపింది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం మహిళా డాక్టర్లకు రక్షణ ఇచ్చేందుకు వెనుకాడితే, అప్పుడు కేంద్ర ప్రభుత్వం వాళ్లకు రక్షణ ఇస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. నైట్ షిఫ్ట్ విషయంలో సవరణ చేస్తూ కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని బెంగాల్ సర్కారు తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు.

**న్యూఢిల్లీ:** దేశ అత్యున్నత న్యాయస్థానం మూడు కీలక తీర్పులు విచారించింది. అక్రమ నిర్మాణాలను బుల్డోజర్లతో కూల్చివేసే ప్రక్రియకు సుప్రీంకోర్టు బ్రేక్ వేసింది. నైట్ షిఫ్ట్‌ల నుంచి మహిళా డాక్టర్లకు విముక్తి కల్పిస్తూ బెంగాల్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. నైట్ షిఫ్ట్‌లో పనిచేసే మహిళలను అడ్డుకోలేమని తెలిపింది. కోల్‌కతా జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్య కేసుపై మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారం అంశంపై బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని నిలిపివేయాలని కోరారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాబట్టి విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని ఆపబోమని స్పష్టం చేసింది.

అక్రమ నిర్మాణాలను బుల్డోజర్లతో కూల్చివేసే ప్రక్రియకు సుప్రీంకోర్టు బ్రేక్ వేసింది. అక్టోబర్ ఒకటో తేదీ వరకు అలాంటి చర్యలను నిలిపివేయాలని కోర్టు ఆదేశించింది. బుల్డోజర్ వినియోగంపై మళ్లీ వాదనలు చేపట్టే వరకు ఆ చర్యలను ఆపేయాలన్నది. వచ్చే విచారణ వరకు కూల్చివేతలను ఆపేస్తే .. ఆకాశం ఏమీ ఊడిపడదు అని కోర్టు పేర్కొన్నది. జస్టిస్ బీఆర్ గవాయి, కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నది. అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని తప్పుపడుతూ ఇటీవల సుప్రీంకోర్టు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ విధానాన్ని గొప్పగా చిత్రీకరించడాన్ని కూడా అత్యున్నత న్యాయస్థానం తప్పుపట్టింది. ఎన్నికల సంఘానికి కూడా వార్నింగ్ ఇచ్చింది. రోడ్లు, రైల్వే ట్రాక్‌లు, చెరువుల్లో జరిగిన ఆక్రమణల విషయంలో తమ తీర్పు వర్తించదని కోర్టు చెప్పింది.

**లైవ్ స్ట్రీమింగ్ వద్దన్న కపిల్ సిబల్.. ఆపేది లేదన్న సర్వోన్నత న్యాయస్థానం..**

కోల్‌కతా జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్య కేసుపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ ట్రైనీ డాక్టర్ కేసును కోర్టు సుమోటోగా తీసుకొని విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కేసును విచారణ జరిపింది. ఇంతకు ముందు జూనియర్ డాక్టర్ ఘటనపై నిరసన తెలుపుతున్న వైద్యులను విధుల్లో చేరాలని ఇంతకు ముందు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించిన విషయం తెలిసిందే. మంగళవారం విచారణ సందర్భంగా సీబీఐని కోర్టు ప్రస్తుత స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని కోరింది. అలాగే, హాస్పిటల్ ఆర్థిక అవకతవకలపై దర్యాప్తుకు సంబంధించి రిపోర్ట్‌ను సమర్పించాలని సీబీఐకి చెప్పింది. ఈ సందర్భంగా కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారం అంశంపై బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని నిలిపివేయాలని కోరారు. ఇలాంటి కేసులను ప్రత్యక్ష ప్రసారం చేసినప్పుడు అది ప్రభావాన్ని చూపుతుందన్నారు. తాము నిందితులకు ప్రాతినిథ్యం వహించడం లేదని.. 50 సంవత్సరాల రెప్యుటేషన్ ఉందన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఇది ఓపెన్ కోర్టు అని.. ఇది ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశమని తెలిపింది. కపిల్ సిబల్ స్పందిస్తూ ఇది తమ ప్రతిష్టకు సంబంధించిందన్నారు. ఛాంబర్‌లోని మహిళా న్యాయవాదులకు యాసిడ్ దాడి, అత్యాచారం చేస్తామని బెదిరింపులు వస్తున్నాయన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదులకు సోషల్ మీడియాలో బెదిరింపులు వస్తున్నాయని సిబల్ ప్రస్తావించారు. ధర్మాసనం స్పందిస్తూ.. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాబట్టి విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని ఆపబోమని స్పష్టం చేసింది. లాయర్లు, ఇతరులకు ఏదైనా ముప్పు వాటిల్లితే చర్యలు తీసుకుంటామని సిబల్‌కు కోర్టు భరోసా ఇచ్చింది.

**చైనా జాతీయుడికి బెయిల్‌కు ఇచ్చేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు..!**

చైనా జాతీయుడికి బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషనర్‌పై ఉన్న ఆరోపణలు తీవ్రమైనవని పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ చైనీస్ సిటిజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం విచారించింది. నేరం తీవ్రత దృష్ట్యా బెయిల్‌ను ప్రస్తుతానికి పరిగణలోకి తీసుకోలేమని చెప్పింది. అలహాబాద్ హైకోర్టు జులై 31న ఇచ్చిన ఆదేశాలపై చైనా పౌరుడు రెన్ చావో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.వీసా గడువు ముగిసిన తర్వాత దేశంలోనే ఉంటూ అంతర్జాతీయ క్రైమ్ రాకెట్‌ను నడుపుతున్నాడని.. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని చావోపై ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో చావోకు అలహాబాద్ హైకోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. భారత్‌లో వ్యాపారం చేసేందుకు వచ్చిన విదేశీయులు భారతీ చట్టాల ప్రకారం.. జవాబుదారీగా ఉండాలని.. నేర విచారణను ఎదుర్కొంటున్న వ్యక్తి భారత కోర్టుల్లో విచారణ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హైకోర్టు బెయిల్ పిటిషన్ విచారణ సమయంలో స్పష్టం చేసింది. చైనా జాతీయుడి తరఫున న్యాయవాది పీఎన్ పూరి వాదనలు వినిపించారు. చావో 18నెలలుగా జైలులో ఉంటున్నాడని తెలిపారు. ఆరు నెలల తర్వాత తాజాగా బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని.. హైకోర్టు పరిశీలన ప్రభావితం చేయకుండా మెరిట్‌పై నిర్ణయం తీసుకోవచ్చని ధర్మాసనం పేర్కొంది. మోసం, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర ఆరోపణల కింద రెన్ చావోను నోయిడా పోలీసులు 2022, జూలై 9న అరెస్టు చేశారు. చావోపై యూపీ పోలీసులు విదేశీయుల చట్టం కింద అభియోగాలు మోపారు. ఎఫ్ఐఆర్ ప్రకారం.. ఈ-ఎఫ్ఐఆర్ నివేదికను తారుమారు చేశాడని ఆరోపణలున్నాయి. ఈ-వ్యవస్థతో విదేశీ పౌరులు భారత ప్రభుత్వ కార్యాలయాన్ని సందర్శించాల్సిన అవసరం ఉండదు. భారతదేశంలో వీసా, ఇమ్మిగ్రేషన్ సంబంధిత సేవలకు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించే ఆన్‌లైన్ సిస్టమ్.

## బాంబే ఐఐటీకి 'మోతీలాల్ ఓస్వాల్' ₹130 కోట్ల విరాళం

**ముంబయి:** ప్రఖ్యాత సాంకేతిక విద్యా సంస్థ బాంబే ఐఐటీకి ప్రముఖ ఫండ్ మేనేజ్మెంట్ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ భూరి విరాళం అందజేసింది. ₹130 కోట్ల విరాళం చెక్కును ఐఐటీ బాంబే ప్రతినిధులకు ఇచ్చింది. ఈ విద్యా సంస్థలో ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, రీసెర్చ్ మరింతగా మెరుగుపరిచేందుకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు పేర్కొంది. దేశంలోని విద్యా సంస్థలకు ఇచ్చిన అతి పెద్ద కార్పొరేట్ విరాళాల్లో ఇది ఒకటి. అత్యాధునిక విద్యాసంబంధిత మౌలిక వసతులను ఏర్పాటు, ఫైనాన్సియల్ మార్కెట్లో వినూత్న కార్యక్రమాల ఆవిష్కరణే లక్ష్యంగా ఈ సాయాన్ని అందించింది.రూ.4000 కోట్ల ఈక్విటీల్లో 10శాతాన్ని దాతృత్వం కోసం ఇస్తామని ప్రతిజ్ఞ చేసిన మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సిల్ సర్వీసెస్ లిమిటెడ్.. ఈ మొత్తాన్ని అందజేయడం విశేషం. ఐఐటీ బాంబేలో మోతీలాల్ ఓస్వాల్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు ఇది తోడ్పడనుంది. 1-1.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యధునిక లేబోరేటరీలు, రీసెర్చ్ సెంటర్లతో ఈ విద్యా కేంద్రం. ఏర్పాటుకు ఈ సాయం ఉపయోగపడనుంది. గ్లోబల్ టాలెంట్ను ఆకర్షించడం, ఆర్థిక పరిశోధనలో ఆవిష్కరణల్ని ప్రోత్సహించడం ద్వారా సైన్స్ అండ్ టెక్నాలజీలో ఐఐటీ బాంబే స్థానాన్ని మరింత సుస్థిరం చేయడమే ఈ సెంటర్ లక్ష్యం కానుంది. మోతీలాల్ ఓస్వాల్ సెంటర్ ఫర్ క్యాపిటల్ మార్కెట్స్ ద్వారా యూజీ, పీజీ, ప్రొఫెషనల్ లెర్నర్ల కోసం పలు రకాల అకెడమిక్ ప్రోగ్రామ్లను అందించనుంది. తమ విద్యా సంస్థకు సంస్థకు పెద్దమొత్తంలో విరాళం అందించిన మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్కు ఐఐటీ బాంబే డైరెక్టర్ ప్రొఫెసర్ శిరీష్ కెదారె కృతజ్ఞతలు తెలిపారు. ఈ భాగస్వామ్యం ఐఐటీ బాంబే మౌలికవసతులను ఆధునీకరించడంతో పాటు ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్లో మరింత ఉన్నతిని పెంపొందిస్తుందని తెలిపారు. దీనిపై ఫౌండేషన్ ట్రస్టీ మోతీలాల్ ఓస్వాల్ మాట్లాడుతూ.. మోతీలాల్ ఓస్వాల్ నాలెడ్జ్ సెంటర్, సెంటర్ ఫర్ క్యాపిటల్ మార్కెట్స్ వ్యూహాత్మక దాతృత్వ శక్తికి నిదర్శనంగా ఉంటాయన్నారు.



## న్యూయార్క్‌లో స్వామినారాయణ్ ఆలయంపై దాడి



**న్యూయార్క్:** అమెరికాలో బీఏపీఎస్ స్వామినారాయణ్ ఆలయంపై దాడి జరిగింది. ఆ దాడిని న్యూయార్క్‌లోని భారతీయ కౌన్సులేట్ ఖండించింది. ఆ హీనమైన చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అమెరికా పోలీసుల్ని కోరినట్లు భారతీయ కౌన్సులేట్ పేర్కొన్నది. మెలివిల్లీలో ఉన్న స్వామినారాయన్ ఆలయాన్ని ధ్వంసం చేయడం ఆమోదించదగ్గ చర్య కాదు అని భారత కౌన్సులేట్ ఓ ప్రకటనలో తెలిపింది. భారతీయ ప్రజలతో టచ్‌లో ఉన్నామని కౌన్సులేట్ తెలిపింది. లాంగ్ ఐలాండ్‌లోని సఫోలాక్ కౌంటీలో మెలివిల్లీ ఉన్నది. అయితే ఈ ఊరుకు సమీపంలోనే ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 22వ తేదీన భారతీయ ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. ఆలయంపై జరిగిన దాడి ఘటన పట్ల విచారణ చేపట్టాలని హిందూ అమెరికా ఫౌండేషన్ పేర్కొన్నది. హిందూ ఆలయంపై దాడి చేయడం అంటే పిరికిపంద చర్యే అని హిందూ అమెరికన్ ఫౌండేషన్ ఎడిటర్ సుహాగ్ శుక్లా తెలిపారు.హిందువులు, భారతీయ సంస్థలపై దాడులు చేస్తామని ఇటీవల ఖలిస్తానీ ఉగ్రవాది గురుపర్వత్ సింగ్ పన్నూ హెచ్చరికలు చేస్తూ ఓ వీడియోను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే.

### అవాస్తవాలను ప్రచారం చేయడంలో
## ఆరితేరిన కాంగ్రెస్ : అమిత్ షా

**ఫరీదాబాద్:** హరియాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ ముమ్మరం చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ఫరీదాబాద్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. అవాస్తవాలను ప్రచారం చేయడంలో కాంగ్రెస్ నేతలు ఆరితేరారని ఆయన ఆరోపించారు. అగ్నివీర్ జవాన్లకు పనిలేదని, వారికి పెన్షన్ కూడా లేదని కాంగ్రెస్ నేతలు అసత్యాలు వల్లెవేస్తున్నారని అన్నారు.అగ్నివీర్ స్కీమ్‌లో జవాన్లకు పోలీస్ సర్వీసుల్లో 20 శాతం రిజర్వేషన్లు ఉన్నాయని వారికి గుర్తుచేస్తున్నానని అన్నారు. హరియాణలోనూ బుజ్జగింపు రాజకీయాలు చేయాలని కాంగ్రెస్ కోరుకుంటున్నదని దుయ్యబట్టారు. ఇక అంతకుముందు అమిత్ షా లోహరులో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ దేశ సేవలో హరియాణ ప్రజల వాటా ప్రశంసనీయమని అన్నారు. స్వాతంత్ర్యానంతరం హరియాణ నుంచే త్రివిధ దళాల్లోకి అత్యధిక సంఖ్యలో సైనికులు వచ్చారని అన్నారు.మనం ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకునే పరిస్థితుల్లో ఉండగా హరియాణ రైతులు దేశాన్ని ఆదుకున్నారని తెలిపారు. హరియాణ రైతులు చెమటోడ్చి మనకు మిగులు ఆహార ధాన్యాలను అందించారని అన్నారు. ఇక ఒలింపిక్స్, పారా-ఒలింపిక్స్‌లో అత్యధిక మెడల్స్‌ను దేశానికి హరియాణ అథ్లెట్లు అందించారని వివరించారు. ఇక హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని అమిత్ షా స్పష్టం చేశారు.

## కోల్‌కతా పోలీస్ కమిషనర్‌గా మనోజ్ వర్మను నియమించిన బెంగాల్ ప్రభుత్వం

**కోల్ కతా:** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కోల్‌కతా పోలీస్ కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి మనోజ్ కుమార్ వర్మను నియమించింది. ఈ మేరకు బెంగాల్ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. మనోజ్ వర్మకు పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించింది.కాగా, అంతకుముందు కోల్‌కతా సీపీగా ఉన్న వినీత్ గోయల్‌కు ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఆందోళన చేస్తున్న వైద్యుల అభ్యర్థన మేరకు వినీత్ గోయల్‌ను విధుల నుంచి తప్పించింది. ఆయనతోపాటు వైద్య శాఖకు చెందిన పలువురు అధికారులను కూడా తొలగిస్తున్నట్లు ప్రకటించింది. వారి స్థానంలో కొత్త అధికారులను నియమించనున్నట్లు వెల్లడించింది. ఇందులో భాగంగానే కోల్‌కతా సీపీగా మనోజ్ కుమార్ వర్మను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు జూనియర్ డాక్టర్ల ఆందోళన కొలిక్కి వచ్చింది. కోల్‌కతాలో నెలరోజులకు పైగా ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యుల డిమాండ్లు నెరవేర్చేందుకు దీదీ ప్రభుత్వం అంగీకరించింది. నాలుగుసార్లు రద్దు అయిన తర్వాత సోమవారం రాత్రి జూనియర్ డాక్టర్లు ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో చర్చలు జరిపిన విషయం తెలిసిందే.



## రాహుల్ ద్రవిడ్, గౌతమ్ గంభీర్ కోచింగ్ తీరులో తేడాలున్నాయి!

**విశ్వంభర (క్రీడా విభాగం):** బంగ్లాదేశ్‌తో భారత జట్టు రెండు మ్యాచులు ఆడబోతున్నది. ఈ నెల 19న తొలి టెస్ట్ చెన్నైలోని ఎం చిదరంబరం స్టేడియంలో ప్రారంభంకానున్నది. రెండోటెస్ట్ కాన్పూర్ వేదికగా జరుగనున్నది. ఈ టెస్ట్ సిరీస్ ప్రారంభానికి ముందు కెప్టెన్ రోహిత్ శర్మ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో కలిసి పని చేయడంపై కీలక వ్యాఖ్యలు చేశాడు. మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్, గంభీర్‌కు మధ్య తేడాలను తెలిపాడు. ద్రవిడ్ కోచింగ్ శైలికి, గంభీర్ కోచింగ్ తీరులో తేడాలున్నాయని చెప్పారు. గంభీర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని హిట్‌మ్యాచ్ చెప్పుకొచ్చాడు. మంగళవారం మీడియాతో రోహిత్ శర్మ మాట్లాడుతూ.. రాహుల్ ద్రవిడ్, విక్రమ్ రాథోడ్, పరాస్ మాంబ్రే ఓ భిన్నమైన జట్టు, కొత్త సహాయక సిబ్బంది భిన్నమైన విధానాన్ని తీసుకురావడం ఆమోదయోగ్యమైందేనని చెప్పాడు. కొత్త కోచింగ్ స్టాఫ్ స్టయిల్ వేరుగా ఉన్న సమస్యలేదని చెప్పాడు. మంచి అవగాహన కలిగి ఉండడం ముఖ్యమని చెప్పాడు. కోచ్‌గా గౌతమ్ గంభీర్ జులైలో బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం టీమిండియా తొలి టెస్ట్ సిరీస్ ఆడబోతున్నది. భారత జట్టు చివరిసారిగా ఈ ఏడాది మార్చిలో ఇంగ్లండ్‌తో చివరి టెస్ట్ ఆడింది. మళ్లీ సుదీర్ఘ విరామం అనంతరం జట్టు టెస్ట్ క్రికెట్ ఆడబోతున్నది. మ్యాచ్‌కు చాలా సమయం తర్వాత టెస్ట్ క్రికెట్ ఆడుతుండగా..? ఈ విరామం ఆటపై ప్రభావం చూపుతుందా? అని హిట్‌మ్యాన్‌ని ప్రశ్నించగా.. పెద్దగా ప్రభావం చూపదని చెప్పుకొచ్చాడు. ఇంతకు ముందు ఇలాగే జరిగిందని.. పరిస్థితి అనుగుణంగా సులభంగా మారుతూ వస్తామని పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా.. చాలాకాలం తర్వాత టీమిండియా టెస్ట్ క్రికెట్ ఆడుతున్న నేపథ్యంలో బీసీసీఐ చెన్నైలో చిన్న క్యాంప్‌ని ఏర్పాటు చేసింది. చాలాకాలంగా క్రికెట్‌కు దూరంగా ఉన్న ఆటగాళ్లంతా దులీప్ ట్రోఫీలో ఆడేందుకు చెన్నైకి చేరుకున్నారు.

## కోహ్లీ రికార్డుపై కన్నేసిన యశస్వి జైస్వాల్

**విశ్వంభర (క్రీడా విభాగం):** టీమ్ ఇండియా యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్షిప్ లో అద్భుతమైన రికార్డును అందుకోనున్నాడు. ఆ రికార్డు కోహ్లికి కూడా సాధ్యం కాలేదు. జైస్వాల్ ఈ డబ్ల్యుటీసీలో మరో 132 పరుగులు చేస్తే ఒక డబ్ల్యూటీసీ ఎడిషన్లో అత్యధిక రన్స్ చేసిన భారత ఆటగాడిగా ఘనత సాధిస్తాడు. జైస్వాల్ 2023-25 డబ్ల్యూటీసీలో ఇప్పటివరకు 1028 పరుగులు చేశాడు. ఈ క్రమంలోనే అజింక్య రహానె, రోహిత్ శర్మ తర్వాత సింగిల్ ఎడిషన్లో వెయ్యికి పైగా రన్స్ చేసిన మూడో భారత ఆటగాడిగా నిలుస్తాడు. బంగ్లాదేశ్తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్లో యశస్వి ఈ రికార్డును అందుకునే అవకాశముంది. 2019-21 ఎడిషనల్లో అజింక్య రహానె (1159) పరుగులు చేసి అగ్రస్థానంలో ఉన్నాడు. ఓవరాల్ గా చూసుకుంటే ప్రస్తుత టెస్టు ఛాంపియన్ షిప్ లో ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ (1398) పరుగులతో మొదటి స్థానంలో ఉన్నాడు. బెన్ డకెట్ (1028) తో కలిసి యశస్వి రెండో స్థానాన్ని పంచుకుంటున్నాడు.



**ప్రపంచ రికార్డు సృష్టిస్తాడా?**

సిక్లపరంగా ఈ యువ బ్యాటర్ ప్రపంచ రికార్డు సృష్టించే ఛాన్స్ ఉంది. మరో 8 సిక్సు బాదితే ఒక క్యాలెండర్ ఇయర్లో అత్యధిక సిక్సు కొట్టిన ఆటగాడిగా అతడు చరిత్ర సృష్టిస్తాడు. న్యూజిలాండ్ మాజీ ఆటగాడు బ్రెండన్ మెక్కల్లమ్ (33 సిక్సు, 2014) పేరిట ప్రపంచ రికార్డు ఉంది. బెన్ స్టోక్స్ (26 సిక్సు, 2022), యశస్వి జైస్వాల్ (26 సిక్సు, 2024*) రేసులో ఉన్నారు.ఈ ఏడాది భారత్ మరో తొమ్మిది టెస్టులు ఆడనుంది. దీంతో జైస్వాల్ కచ్చితంగా మెక్కల్లమ్ రికార్డును బ్రేక్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

**సెహ్వాగ్ రికార్డుపై రోహిత్ కన్ను**

2013లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన రోహిత్ శర్మ ఇప్పటివరకు 59 మ్యాచ్లు ఆడి 84 సిక్సర్లు బాదాడు. బంగ్లాదేశ్తో జరగనున్న టెస్టు సిరీస్లో చెలరేగి ఆడాలని హిట్మ్యాన్ భావిస్తున్నాడు. అతడు మరో ఎనిమిది సిక్సు కొడితే వీరేంద్ర సెహ్వాగ్ (91 సిక్సు)ను అధిగమించి టెస్టుల్లో ఎక్కువ సిక్సు కొట్టిన భారత ఆటగాడిగా నిలుస్తాడు.




## మహిళా క్రికెటర్లకు ఐసీసీ గుడ్‌న్యూస్

**టీ20 వరల్డ్ కప్‌లో పురుషులతో సమానంగా ప్రైజ్‌మనీ**

**విశ్వంభర (క్రీడా విభాగం):** ప్రపంచకప్ ప్రైజ్ మనీ విషయంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి మంగళవారం కీలక నిర్ణయం తీసుకున్నది. వచ్చే నెలలో యూఏఈ వేదికగా జరిగిన 20టీ వుమెన్స్ ప్రపంచకప్ జరుగనున్నది. ఈ క్రమంలో వుమెన్స్ క్రికెటర్లకు శుభవార్త చెప్పింది. ప్రపంచకప్‌లో మెన్స్ క్రికెటర్లతో సమానంగా వుమెన్స్ క్రికెటర్లకు సైతం ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు ఐసీసీ ప్రకటించింది. ఇకపై టీ20 టైటిల్‌ని నెగ్గిన జట్లు 23.40లక్షల అమెరికన్ డాలర్లు ప్రైజ్‌మనీ దక్కనున్నది. అంటే భారతీయ కరెన్సీలో దాదాపు 19.60కోట్లు. గతేడాది దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన వుమెన్స్‌టీ 20 ప్రపంచకప్ నెగ్గిన జట్టుకు రూ.8.37కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. ఈ ఏడాది అమెరికా, వెస్టిండిస్ వేదికగా జరిగిన టీ20 వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా మెన్స్ జట్టుకు రూ.23.40లక్షల అమెరిన్ డాలర్ల ప్రైజ్‌మనీ లభించిన విషయం తెలిసిందే.తాజాగా జరిగే వుమెన్స్ టీ20 విజేతకు సైతం అంతే మొత్తంలో ప్రైజ్‌మనీ దక్కబోతున్నది. గతేడాదితో పోలిస్తే ప్రైజ్‌మని 134శాతం పెరిగినట్లయ్యింది. ఐసీసీ జూలై 2023లో జరిగిన ఐసీసీ వార్షిక సమావేశంలో ప్రైజ్‌మనీపై నిర్ణయం తీసుకున్నది. ఐసీసీ తాజా నిర్ణయంతో క్రికెట్ వరల్డ్ కప్‌లో మెన్స్, వుమెన్స్ జట్టుకు సమానంగా ప్రైజ్‌మని ఇచ్చే తొలి క్రీడగా క్రికెట్ నిలిచింది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన జట్టుకు ఇప్పుడు 1.7 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే రూ.14.24కోట్లు ఇవ్వనున్నారు. గతంలో రన్నరప్‌కు రూ.4.18కోట్లు దక్కేది. రన్నరప్ ప్రైజ్ మనీ సైతం 134 శాతం పెరగడం విశేషం. సెమీఫైనల్స్‌లో ఓడిన జట్లకు, గ్రూప్ దశలో నిష్క్రమించిన జట్లకు సైతం ప్రైజ్‌మనీని ఐసీసీ పెంచింది.

## ధోనీ రికార్డుకు చేరువలో పంత్



**విశ్వంభర (క్రీడా విభాగం):** భారత్-బంగ్లాదేశ్ తొలి టెస్ట్ సిరీస్ సెప్టెంబర్ 19న చెన్నై వేదికగా ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. 2022లో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ భారత ఆటగాడు రిషభ్ పంత్ ఈ సిరీస్లోనే టెస్టోకి పునరాగమనం చేయబోతున్నాడు. 20నెలల విరామం తర్వాత సుదీర్ఘ ఫార్మాట్లో ఆడనున్న పంత్ బంగ్లాతో జరగబోయే టెస్టో ఓ అరుదైన ఫీట్ను అందుకునే అవకాశం ఉంది.భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తన కెరీర్లో 90 టెస్టు ఆడాడు. దాంట్లో ఆరు శతకాలు సాధించి రికార్డు సృష్టించాడు. అయితే, 33 టెస్టో నే ఐదు సెంచరీలు నమోదు చేసిన పంత్.. ధోనీ రికార్డు బద్దలు కొట్టడానికి ఇంకో 2 శతకాలు చేయాల్సి ఉంది. కాగా, ఈ సిరీస్లో ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్ని కూడా వికెట్ కీపర్లుగా ఎంపిక చేయడంతో పంత్కు గట్టి పోటీనే ఉన్నప్పటికీ, దులీప్ ట్రోఫీలో ఆకట్టుకోవడంతో ప్రస్తుతం పంత్ వైపే మొగ్గు చూపే అవకాశముంది. ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన దులీప్ ట్రోఫీలో ఇండియా బి తరపున ప్రాతినిధ్యం వహించిన పంత్ 47 బంతుల్లోనే 61 పరుగులు చేశాడు. అంతేకాకుండా, ఒకే మ్యాచ్లో 7 క్యాచ్లు అందుకున్నాడు. ఇందులో మొదటి ఇన్నింగ్స్ రెండు, రెండో ఇన్నింగ్స్ లో ఐదు ఉన్నాయి.

## టీమిండియా చరిత్ర! ఆసియా చాంఫియన్స్ హాకీ ట్రోఫీ విజేత భారత్

**విశ్వంభర (క్రీడా విభాగం):** భారత హాకీ జట్టు చరిత్ర సృష్టించింది. ఆసియా ఛాంపియన్స్ హాకీ ట్రోఫీని నెగ్గింది. వరుసగా రెండోసారి టైటిల్‌ని నిలుబెట్టుకున్న టీమిండియా.. మొత్తం ఐదుసార్లు ట్రోఫీని నెగ్గింది. ఫైనల్ మ్యాచ్‌లో చైనాపై 1-0 తేడాతో విజయం సాధించింది. ఫైనల్‌లో జుగ్‌రాజ్ సింగ్ నాల్గో క్వార్టర్‌లో తొలి గోల్‌ను చేయడంతో టీమిండియా ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ప్రత్యర్థికి ఛాన్స్ ఇవ్వకుండా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని బృందం కప్‌ని సొంతం చేసుకున్నది. ఆసియా ఛాంపియన్స్ హాకీ టైటిల్‌ని భారత్ ఇప్పటి వరకు ఐదుసార్లు నెగ్గింది. ఆ తర్వాత పాక్ మూడుసార్లు ట్రోఫీని కైవసం చేసుకున్నది. 2021లో దక్షిణ కొరియా టైటిల్‌ని నెగ్గింది. చైనా ఫైనల్‌కు చేరుకోవడం ఇదే తొలిసారి. టోర్నీ చరిత్రలోనే తొలిసారిగా అత్యుత్తమంగా ఫైనల్‌కు చేరింది. భారత్ గ్రూప్ దశలో జపాన్‌ను 5-1 తేడాతో ఓడించింది. చైనాను 3-0, మలేషియాపై 8-1, దక్షిణ కొరియాను 3-1, చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఉత్కంఠ పోరులో 2-1 తేడాతో విజయం సాధించింది. సెమీ ఫైనల్స్‌లో దక్షిణ కొరియాపై 4-1 తేడాతో విజయం సాధించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని జట్టు చరిత్రలో తొలిసారిగా వరుసగా బ్యాక్ టు బ్యాక్ ఎడిషన్స్‌లో టైటిల్స్‌ను నిలబెట్టుకున్నది. గతేడాది చెన్నైలో జరిగిన సమ్మిట్‌లో మలేషియాను 4-3తో ఓడించి సొంతగట్టపై టైటిల్‌ను నెగ్గింది. గతంలో 2021, 2016లో భారత్ ట్రోఫీని నెగ్గింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఏడు గోల్స్‌తో పోటీలో అత్యధిక గోల్స్ చేసిన రెండో ఆటగాడిగా నిలువగా.. దక్షిణ కొరియాకు చెందిన యాంగ్ జి-హున్ అగ్రస్థానంలో నిలిచాడు.



## 9 వికెట్లు తీసిన అర్జున్ టెండూల్కర్



**పనాజీ:** మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్.. ప్రస్తుతం గోవా జట్టు తరపున తన ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడుతున్నాడు. తాజాగా జరిగిన కే తిమ్మప్పయ్య మెమోరియల్ టోర్నమెంట్ మ్యాచ్‌లో అతను కీలక రోల్ ప్లే చేశాడు. కర్నాటకతో జరిగిన మ్యాచ్‌లో అర్జున్ టెండూల్కర్ రెండు ఇన్నింగ్స్‌లో కలిపి 9 వికెట్లు తీసుకున్నాడు. ఆ మ్యాచ్‌లో గోవా జట్టు ఇన్నింగ్స్ 189 రన్స్ తేడాతో కర్నాటకపై విజయం సాధించింది.తొలి ఇన్నింగ్స్‌లో అర్జున్ 13 ఓవర్లలో 41 రన్స్ ఇచ్చి అయిదు వికెట్లు తీసుకున్నాడు. కర్నాటక జట్టు 36.5 ఓవర్లలో కేవలం 103 రన్స్ చేసి ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. ఆ తర్వాత గోవా భారీ స్కోర్ చేసింది. గోవా జట్టు 413 రన్స్ చేసింది. అభినవ్ తేజ్రానా 109, మంథన్ కుటాకర్ 69 రన్స్ చేశారు. 310 రన్స్ వెనుకబడి ఉన్న కర్నాటక జట్టు.. రెండో ఇన్నింగ్స్‌లో 30.4 ఓవర్లలో 121 రన్స్ చేసి ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో అర్జున్ టెండూల్కర్ 13.3 ఓవర్లలో 46 రన్స్ చేసి 4 వికెట్లు తీసుకున్నాడు.

## టీ20 ఏమీ చిన్న ఫార్మాట్ కాదు.. ఈసారి ఒత్తిడిని జయిస్తాం

**విశ్వంభర (క్రీడా విభాగం):** అంతర్జాతీయంగా అన్ని ఫార్మాట్లలో అదరగొడుతున్న భారత మహిళల జట్టు టీ20 వరల్డ్ కప్ కలను నిజం చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. మెగా టోర్నీ కోసం బెంగళూరులో టీమిండియా 10 రోజుల క్యాంప్‌లో కఠోర సాధన చేస్తోంది. ఈమధ్యే ఆసియా కప్‌లో ట్రోఫీ చేజార్చుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన పొట్టి ప్రపంచకప్ ముందు మానసిక సన్నద్ధతపై దృష్టి పెట్టింది. ఇదే విషయాన్ని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మీడియా సమావేశంలో వెల్లడించింది.అందరూ టీ20 ఫార్మాట్ అనగానే.. చాలా చిన్నది అనుకుంటారు. కానీ, ఒక రోజులో మేము 40 ఓవర్లు ఆడుతాం. ఈ ఫార్మాట్‌లో ఆఖరి 4-5 ఓవర్లు చాలా కీలకం. ఈ ఓవర్లలో మానసికంగా ధృఢంగా ఉన్న జట్టునే విజయం వరిస్తుంది. గత కొన్ని ఏండ్లుగా మేము మానసికంగా బలంగా ఉండడంపై సాధన చేస్తాం. ఇంతకుముందులా ఒత్తిడికి తలొగ్గము అని హర్మన్‌ప్రీత్ తెలిపింది. టీ20 వరల్డ్ కప్‌లో టీమిండియా టైటిల్ కోసం నిరీక్షిస్తూనే ఉంది. 2020లో ఫైనల్ చేరినా ఒత్తిడికి లోనై ఆస్ట్రేలియా చేతిలో 85 పరుగుల తేడాతో ఓడి విశ్వ విజేత అయ్యే అవకాశం చేజార్చుకుంది. అంతేకాదు 2022 కామన్‌వెల్త్ గేమ్స్‌లోనూ మళ్లీ టీమిండియాకు ఆసీస్ చెక్ పెట్టింది. అప్పుడు 9 పరుగుల తేడాతో ఓటమి ఎదురైంది. తాజాగా ఆసియా కప్ ఫైనల్లో శ్రీలంక హర్మన్‌ప్రీత్ సేనకు షాకిచ్చి తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. ఈ అనుభవాల నుంచి పాఠం నేర్చుకుంటేగానీ భారత మహిళల జట్టు టీ20 వరల్డ్ కప్ కల నిజం కాదనేది విశ్లేషకుల అభిప్రాయం. టీ20 వరల్డ్ కప్ ఈసారి యూఏఈ వేదికగా అక్టోబర్ 3న మొదలవ్వనుంది. అక్టోబర్ 4వ తేదీన న్యూజిలాండ్‌తో, ఆ తర్వాత అక్టోబర్ 6న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో టీమిండియా తలపడనుంది.



## గ్లాస్గోలో కామన్వెల్త్ గేమ్స్?

commonwealth sport

**లండన్:** 2026లో జరుగనున్న కామన్వెల్త్ క్రీడలకు స్కాట్లాండ్ రాజధాని గ్లాస్గో ఆతిథ్యమివ్వనున్నట్టు సమాచారం. వాస్తవానికి వచ్చే ఎడిషన్ గేమ్స్‌కు విక్టోరియా(ఆస్ట్రేలియా) ఆతిథ్యమివ్వాల్సి ఉండగా వ్యయభారం కారణంగా ఆ నగరం తాము రేసు నుంచి వైదొలుగుతున్నామని గతేడాదే ప్రకటించింది. గ్లాస్గో ఇదివరకే 2014 లో ఈ క్రీడలను నిర్వహించింది.

### రెండో రోజూ అప్పర్ సర్క్యూట్ లిమిట్ తాకిన


## బజాజ్ హైసింగ్ ఫైనాన్స్




**విశ్వంభర(బిజినెస్):** కొత్తగా దేశీయ స్టాక్ మార్కెట్లలో లిస్టయిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ షేర్లు వరుసగా రెండో రోజు మంగళవారం మరో రికార్డు నమోదు చేశాయి. మంగళవారం బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్ 10 శాతం వృద్ధితో అప్పర్ సర్క్యూట్ లిమిట్‌ను తాకింది. బీఎస్ఈలో సంస్థ షేర్ 10 శాతం పుంజుకుని రూ.181.48, ఎన్ఎస్ఈలో 10 శాతం వృద్ధితో రూ.181.50 వద్ద ఒక రోజు గరిష్ట పరిమితిని దాటేసింది. దీంతో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13,733.12 కోట్లు పెరిగి రూ.1,51,139.21 కోట్లకు చేరుకున్నది. స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ కోసం ఇష్యూ ధర రూ.70 నుంచి బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్ విలువ 159.28 శాతం వృద్ధి చెందింది. తద్వారా హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల్లో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ మొదటి స్థానంలో నిలిచింది. హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ రూ.49,056.56 కోట్లతో రెండో స్థానంలోకి చేరింది.ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ ఎం-క్యాప్ రూ.37,239.27 కోట్లతో మూడో స్థానానికి, పీఎన్బీ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ రూ. 27,333.34 కోట్లతో నాలుగో స్థానానికి, ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ రూ.19,531.62 కోట్లతో ఐదో స్థానానికి చేరుకున్నాయి. అప్టస్ వాల్యూ హౌసింగ్ ఫైనాన్స్ ఇండియా లిమిటెడ్ ఎం-క్యాప్ రూ.16,638.12 కోట్లు, ఆవాస్ ఫైనాన్సియర్స్ రూ. 14,461.15 కోట్లతో, సమ్మాన్ క్యాపిటల్ రూ.11,816.40 కోట్లతో, క్యాన్ ఫిన్ హోమ్స్ రూ. 11,717.56 కోట్లతో, హోం ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ రూ.10,419.52 కోట్లతో తర్వాతీ స్థానాలకు చేరుకున్నాయి. సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ స్టాక్స్ లిస్టయ్యాయి. లిస్టయిన తొలి రోజే ఇష్యూ ధర 70పై భారీ ప్రీమియంతో అంటే దాదాపు 136 శాతం వృద్ధితో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్ స్థిర పడింది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లోనూ సంస్థ షేర్ రూ.150లకు చేరుకున్నది. ఇష్యూ ధర నుంచి 114.28 శాతం వృద్ధి చెందింది. బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ రూ.6,560 కోట్లతో ఐపీఓకు వెళ్లింది. ఈ నెల 11తో ముగిసిన ఐపీఓలో సంస్థ షేర్ 63.60 రెట్లు సబ్ స్క్రైబ్ అయ్యింది.

### ఆగస్టులో తగ్గిన ఎగుమతులు..

## పెరిగిన వాణిజ్య లోటు



**ఢిల్లీ:** దేశం నుంచి వస్తువుల ఎగుమతులు ఆగస్టు నెలలో క్షీణించాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 9.3 శాతం మేర పడిపోయాయి. గతేడాది ఇదే సమయంలో 38.28 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు ఈ ఏడాది 34.71 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం సంబంధిత డేటాను విడుదల చేసింది. అదే సమయంలో దిగుమతులు 3.3 శాతం మేర పెరిగాయి. గతేడాది ఆగస్టులో 62.3 బిలియన్ డాలర్లుగా ఉన్న దిగుమతులు ఈ సారి 64.36 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం కారణంగా వాణిజ్య లోటు 29.65 బిలియన్ డాలర్లకు పెరిగింది.

### అప్రమత్తంగా వ్యవహరిస్తున్న ఇన్వెస్టర్లు..

## స్వల్ప లాభాల్లో ముగిసిన మార్కెట్లు..

**విశ్వంభర (బిజినెస్):** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండోరోజు సెన్సెక్స్ జీవితకాల గరిష్ఠానికి చేరుకున్నది. వాస్తవానికి యూఎస్ ఫెడ్ కీలకమైన వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందన్న అంచనాల మధ్య మదుపరులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లు లాభాల్లో మొదలై.. కొద్దిసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ఆ తర్వాత మళ్లీ కొలుకున్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ తొలిసారిగా పాయింట్ల వద్ద 83,152.41 తొలిసారిగా ఆల్‌టైమ్ హైకి చేరుకున్నది. ఇంట్రాడేలో 82,866.68 పాయింట్లకు తగ్గింది. చివరకు 90.88 పాయింట్ల లాభంతో 83,079.66 వద్ద స్థిరపడింది.నిఫ్టీ 34.80 పాయింట్ల లాభంతో 25,418.55 వద్ద స్థిరపడింది. లిస్టెడ్ కంపెనీల్లో 1,713 షేర్లు లాభాల్లో కొనసాగగా.. 2,236 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, భారతీ ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, ఎంఅండ్ఎం, లార్సెన్, కోటక్ మహీంద్రా, బ్రిటానియా, సిప్లా, ఓఎన్‌జీసీ, టాటా కంపెనీ లాభాల్లో ముగిశాయి. టాటా మోటార్స్, ఐచర్ మోటార్స్ అదానీ పోర్ట్స్, కోల్ ఇండియా, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఏషియన్ పేయింట్స్, బీపీసీఎల్, ఐటీసీ నష్టాల్లో ముగిశాయి. సెక్టోరల్ ఇండెక్స్‌లో నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.5శాతం, నిఫ్టీ ఆటో 0.3శాతం పెరిగాయి. మీడియా, పీఎస్‌యూ, మెటల్ నష్టాల్లోకి జారుకున్నాయి.

# సోషల్ మీడియాలో ప్రియా ప్రకాశ్ వారియర్ హాట్ షో



సాధారణంగా సినీ రంగంలో హీరోయిన్లుగా సక్సెస్ అవ్వాలంటే అందం, అభినయంతో పాటు అదృష్టం కూడా ఉండాలి. అలా ఉంటేనే వరుసగా ఆఫర్లు వచ్చి స్టార్‌డమ్‌ను అందుకుంటారు. కానీ, కొందరు హీరోయిన్లు అన్నీ ఉన్నా ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారిలో ప్రియా ప్రకాశ్ వారియర్ ఒకరు. ఒక్కసారిగా సెన్సేషన్ అయిన ఈ అమ్మడు.. సౌత్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఆఫర్లు అందుకుంది. కానీ, సక్సెస్‌లు సాధించలేకపోతోంది. ఇక, సోషల్ మీడియాలో యమా రచ్చ చేసే ప్రియా ప్రకాశ్ వారియర్ తాజాగా కొన్ని ఫొటోలను వదిలింది. వాటిని మీరే చూసేయండి మరి!

ఒక్క సైగతో సెన్సేషన్‌గా చిన్న ఏజ్‌లో ఉన్నప్పుడే ప్రియా ప్రకాశ్ వారియర్ 'ఒరు అదార్ లవ్' అనే టీనేజ్ లవ్ మూవీతో హీరోయిన్‌గా ఎంటరైంది. ఇందులో ఈ అమ్మడు కన్నుగీటడం, ఫ్లయింగ్ కిస్ గన్ సీన్‌తో ఒక్కసారిగా సెన్సేషన్ అయింది. ఇదే సినిమా చాలా భాషల్లోకి కూడా డబ్బింగ్ కూడా చేశారు. ఫలితంగా ప్రియా వారియర్‌కు దేశ వ్యాప్తంగా గుర్తింపు లభించడంతో పాటు ఆఫర్లు వెల్లువెత్తాయి.

తెలుగులోకి వచ్చింది ఫస్ట్ మూవీతోనే నేషనల్ క్రేజ్‌ను అందుకున్న ప్రియా ప్రకాశ్ వారియర్.. డబ్బింగ్ చిత్రంతో తెలుగు వాళ్లను పలకరించింది. ఈ క్రమంలోనే నితిన్‌తో 'చెక్' అనే మూవీ చేసింది. కానీ, ఇది ఆదరణను పొందలేదు. తర్వాత తేజ సజ్జాతో కలిసి 'ఇష్క్: నాట్ ఏ లవ్ స్టోరీ' మూవీ చేసింది. ఇది మాత్రం ప్రేక్షకుల మన్ననలు పొందడంతో పాటు ప్రియా ప్రకాశ్‌కు పేరు తెచ్చిపెట్టింది. ఆ మూవీల్లో నటించినా ఆరంభంలోనే ప్రియా ప్రకాశ్ వారియర్ బాలీవుడ్‌లో 'శ్రీదేవి బంగ్లా' అనే సినిమా చేసింది. వివాదం అయిన ఈ మూవీ షూటింగ్ దశలోనే నిలిచిపోయింది. గత ఏడాది 'బ్రో' మూవీలో సాయి ధరమ్ తేజ్ చెల్లిగా చేసింది. కానీ, ఇది కూడా సక్సెస్ కాలేదు. ఇప్పుడు హిందీలో 'త్రీ మంకీస్', 'లవ్ హ్యాకర్స్', 'యారియన్ 2' కన్నడంలో 'విష్ణుప్రియ' అనే మూవీల్లో నటిస్తోంది.

అందులో హల్చల్‌గా కేరళకు చెందిన ప్రియా ప్రకాశ్ వారియర్ వరుస పెట్టి సినిమాలు చేస్తూ దేశ వ్యాప్తంగా పేరు తెచ్చుకుంది. ఇలా కెరీర్ పరంగా బిజీగా ఉన్నా సోషల్ మీడియాలోనూ ఎంతో యాక్టివ్‌గానే ఉంటోంది. ఇందులో భాగంగానే తన పర్సనల్ లైఫ్‌కు, తన కెరీర్‌కు సంబంధించిన ఎన్నో అంశాలను ఫాలోవర్లతో పంచుకుంటోంది. తద్వారా తన ఫాలోయింగ్‌ను పెంచుకుంటూ దూసుకుపోతోంది. అందంతో పడేస్తోంది సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చినప్పటి నుంచే ప్రియా ప్రకాశ్ వారియర్.. వెండితెరపై గ్లామర్ షో చేయడానికి ఉత్సాహంగా వస్తోంది. అలాగే, సోషల్ మీడియాలో ఈ అమ్మడు అదిరిపోయే హాట్ షోతో కుర్రకారును రెచ్చగొడుతోంది. ఇలా తన హాట్ హాట్ ఫొటోలు, వీడియోలను షేర్ చేస్తూ కవ్విస్తోంది. దీంతో ఈ అమ్మడి పేరు మారుమ్రోగిపోవడంతో పాటు తరచూ సెన్సేషన్‌గా మారుతోంది.

ఘాటు ఫొటోలు వైరల్ మలయాళ బ్యూటీ ప్రియా ప్రకాశ్ వారియర్ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని బోల్డు ఫొటోలను షేర్ చేసింది. వీటిలో ఆమె స్ట్రాప్ అండ్ స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో విపరీతంగా హాట్ షో చేస్తోంది. ఈ పిక్‌లలో పైన అందాలు మొత్తం కనిపిస్తూ రెచ్చగొడుతోన్నాయి. దీంతో ఈ ఫొటోలకు నెటిజన్ల నుంచి భారీ స్థాయిలో స్పందన వస్తోంది. తద్వారా ప్రియా ప్రకాశ్ ఫొటోలు వైరల్‌గా మారాయి.

# త్రివిక్రమ్ శ్రీనివాస్‌పై కంప్లయింట్ ఇచ్చిన పట్టించుకోలేదు: పూనం కౌర్



టాలీవుడ్ స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది సినీ నటి పూనం కౌర్. ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా త్రివిక్రమ్‌పై పలుసార్లు సంచలన వ్యాఖ్యలు చేసిన పూనం కౌర్ మరోసారి విరుచుకుపడింది.టాలీవుడ్‌లో ప్రస్తుతం జానీ మాస్టర్ లైంగిక వేధింపుల ఆరోపణలు హాట్ టాపిక్ అవుతున్న నేపథ్యంలో జానీని మాస్టర్ అని పిలవకండి అలా పిలవాలంటే కనీసం గౌరవం ఉండాలి అంటూ చెప్పుకొచ్చింది. ఈ క్రమంలోనే తాను త్రివిక్రమ్ శ్రీనివాస్‌పై ఇచ్చిన కంప్లయిట్‌ను తీసుకున్నారా అంటూ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌ను ప్రశ్నించింది. నాలాంటి వాళ్లకి పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ లేకపోవచ్చు. అందుకే నన్ను సైలెంట్ గా పక్కనబెట్టేశారు. నేను అప్పుడు మా అసోసియేషన్‌లో ఉన్న పెద్దవాళ్లకి కంప్లయింట్ చేశాను. ఇప్పుడైన ఇండస్ట్రీ పెద్దలు ఈ విషయంపై త్రివిక్రమ్‌ను ప్రశ్నించాలని కోరుతున్నాను అంటూ పూనం రాసుకొచ్చింది. అంతకుముందు కూడా త్రివిక్రమ్‌పై సంచలన వ్యాఖ్యలు చేసింది ఈ భామ. త్రివిక్రమ్ ఎలాంటి వాడో, ఆయన చెడు స్వభావం ఎంటో నాకు తెలుసు. మగవారి ఇగో కోసం ఆయన సపోర్ట్ చేస్తారని కూడా తెలుసు. నీవు నీ అనుభవంతో మాట్లాడుతుంటే.. నేను నా అనుభవంతో మాట్లాడుతున్నాను. ఇతరుల జీవితాలను త్రివిక్రమ్ నాశనం చేస్తారు. ఒకసారి త్రివిక్రమ్ దగ్గరకు వెళ్లి తనకు ఆయన ఏం చేశాడో, వేరే వాళ్ల చేత ఏం చేయించాడో ఆయన్నే అడగండని మరోసారి ఫైర్ అయింది.



# రెమ్యునరేషన్ అమాంతం పెంచేసిన తృప్తి డిమ్రి!

చాలా రోజులుగా సోషల్ మీడియాను షేక్ చేస్తున్న భామల్లో టాప్‌లో ఉంటుంది తృప్తి డిమ్రి. యానిమల్ సినిమాలో అందాలు ఆరబోసి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ బ్యూటీ అతి తక్కువ కాలంలోనే బాలీవుడ్‌లో వన్ ఆఫ్ ది బిజీయెస్ట్ హీరోయిన్‌గా మారిపోయింది. మరోవైపు బ్యాడ్ న్యూజ్ కూడా మంచి వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు బీటౌన్ దర్శకనిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.ఇదిలా ఉంటే ఈ భామ తన రెమ్యునరేషన్‌ను భారీగా పెంచేసిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం తృప్తి డిమ్రి రూ.6 కోట్ల నుంచి 10 కోట్లకు పెంచేసిందని ఇన్‌సైడ్ టాక్. కాగా తృప్తి డిమ్రి సక్సెస్ వేవ్‌లో దూసుకెళ్తుండటంతో రెమ్యునరేషన్‌ను అమాంతం పెంచేసిందన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తృప్తి డిమ్రి ఖాతాలో భూల్ భులయ్యా 3, ధడక్ 2, VICKY VIDYA KA WOH WALA VIDEO సినిమాలున్నాయి. వీటితోపాటు పలు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.










Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com